


# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

visit us @ https://www.suryaepaper.com

బుధవారం | 18 మార్చి 2026 | హైదరాబాద్

సంపుటి 19 | సంచిక 149

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం బహుళ పక్షం, చతుర్దశి ఉ.7.53 పూర్వాభాద్ర తె.5.35, వర్జ్యం మ.12.03 నుంచి 1.38 వరకు రాహుకాలం మ.12.00 నుంచి 1.30 వరకు దుర్ముహూర్తం ఉ.11.48 నుంచి 12.35 వరకు

## పెట్రోల్, డీజిల్
# ధరలు పెంచం

● సోషల్ మీడియాలో ప్రచారం అంతా అబద్ధం ● ప్రకటన చేసిన కేంద్రం

పశ్చిమ ఆసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ చమురు మార్కెట్లు తీవ్ర అస్థిరతను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాలతో ఎప్పుడు ఎలాంటి పిడుగు తమపై పడుతుందో అనే ఆందోళన భారత్?లోని వాహనదారులను టెన్షన్ పెట్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ప్రణాళిక లేదని పెట్రోలియం మంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటించింది. అంతర్-మంత్రిత్వ శాఖల సమావేశంలో పెట్రోలియం మరియు సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ప్రణాళికలు కేంద్ర ప్రభుత్వానికి లేదని క్లారిటీ ఇచ్చారు.




వివరాలు-6లో

## దివ్యాంగులకు
# ఉగాది కానుక

రాష్ట్రంలోని దివ్యాంగుల జీవనోపాధి, స్వావలంబనకు కొత్త దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు మంగళగిరిలో ప్రారంభించనున్నారు.ఉగాది కానుకగా తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని సుమారు 11.16 లక్షల దివ్యాంగులు ప్రత్యక్షంగా లబ్ధి పొందనున్నారు. అదేవిధంగా సహాయకులతో కలిపి మొత్తం 12.76 లక్షల మందికి ఈ పథకం ప్రయోజనం చేకూరనుంది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొననున్నారు.రాష్ట్రంలోని దివ్యాంగులకు పెద్ద ఊరట కలిగించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు మంగళగిరిలో ప్రారంభించనున్నారు.



● ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి శ్రీకారం ● 11 లక్షలకు పైగా దివ్యాంగులకు ప్రయోజనం ● సహాయకులకు 50 శాతం రాయితీ.. రాష్ట్రవ్యాప్తంగా అమలు ● రేపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి ప్రారంభం

వివరాలు-2లో

### రెండో రోజూ స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది

ఉదయం సూచీలు లాభనష్టాల మధ్య కదలికలు కనబరిచాయి, కానీ చివర్లో కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లో నిలిచాయి.



5 లో

### ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ రైట్ హ్యాండ్ హతం

● గల్ఫ్ సహా పలు దేశాలలో అంతర్జాతీయ ప్రయాణాలు, భద్రతకు తీవ్ర అంతరాయాలు ● అనేక దేశాల్లో చిక్కుకుపోయిన వేలాది మంది ప్రయాణికులు



6 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## 5 బిలియన్‌ల మందికి భోజనం సేవ ఇస్కాన్ అక్షయ పాత్ర
# ప్రారంభించిన భారత రాష్ట్రపతి



3 లో

అక్షయ పాత్ర ఫౌండేషన్ తన 25 ఏళ్ల సేవా ప్రయాణాన్ని పూర్తి చేసుకుంటూ 5 బిలియన్ భోజనాల మైలురాయిని న్యూ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో స్మరించుకుంది. ఈ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

## ఏపీలో 20 లక్షల
# ఉద్యోగాల కల్పనే లక్ష్యం

● మంగళగిరి సమీపంలో ఏపీఈడీబీ నూతన కార్యాలయం ప్రారంభం ● ఒప్పందాలు కాదు.. పెట్టుబడులు కార్యరూపం దాల్చాలి ● ప్రపంచ దిగ్గజ సంస్థలు ఏపీ వైపు.. వేగం పెంచాలని పిలుపు ● ప్రతి ప్రాజెక్ట్ గ్రౌండింగ్‌పై ప్రత్యేక దృష్టి ● రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్



2 లో

## అంతా ఇంతే!




గ్యాస్ కోసం రెండ్రోజులు లీవు కావాలి సార్!

## మే 15లోపు ఇరిగేషన్
# పనులు పూర్తి

● ఓఅండ్ ఎం పనులపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ● ఖరీఫ్‌కు ముందే కాలువలు, గేట్లు సిద్ధం చేయాలి ● గత ప్రభుత్వ నిర్లక్ష్యంపై మంత్రి విమర్శలు ● జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వహణ పనులను వేగవంతం చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులకు ఆదేశించారు. ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులపై ఇరిగేషన్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.




2 లో

## కేసీఆర్ బాధ్యతగా
# అసెంబ్లీకి రావాలి

బీఆర్ఎస్ అందుకే రాజ్యసభ అభ్యర్థిని పెట్టలేదు : మంత్రి శ్రీధర్ బాబు

ప్రస్తుత రాజకీయ పరిణామాలపై మంత్రి శ్రీధర్ బాబు చిట్‌చాట్ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నందున దాన్ని బలహీనపరచడానికి బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. జీవన్ రెడ్డి విషయంపై స్పందిస్తూ.. ఆయన ఎలాంటి పదవులు కోరుకోలేదని, స్థానిక సమస్యలే ఉన్నాయని తెలిపారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.



3 లో

## హార్ముజ్ అడ్డంకులు చెరిపేసి
# భారత్‌కు చేరిన ఎల్పీజీ నౌకలు

● గుజరాత్ పోర్టులకు చేరిన 'శివాలిక్', 'నందాదేవి' నౌకలు ● రాష్ట్రాలకు గ్యాస్ సరఫరా ప్రారంభం - ఉపశమనం పొందనున్న ప్రజలు ● త్వరలో తమిళనాడుకు నౌకలు - సరఫరా వేగవంతం చేయాలని కేంద్రం నిర్ణయం




6 లో

దేశవ్యాప్తంగా ఏర్పడిన ఎల్పీజీ కొరతపై కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా హార్మూజ్ జలసంధి వద్ద నిలిచిపోయిన భారత్‌కు చెందిన రెండు భారీ ఎల్పీజీ నౌకలు సురక్షితంగా దేశానికి చేరుకోవడంతో గ్యాస్ సరఫరా సమస్యకు త్వరలో పూర్తి పరిష్కారం లభించనుంది.




# దివ్యాంగులకు ఉగాది కానుక

## ఉచిత బస్సు ప్రయాణం

- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి శ్రీకారం
- 11 లక్షలకు పైగా దివ్యాంగులకు ప్రయోజనం
- సహాయకులకు 50 శాతం రాయితీ..రాష్ట్రవ్యాప్తంగా అమలు
- రేపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రారంభం



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి :రాష్ట్రంలోని దివ్యాంగుల జీవనోపాధి, స్వావలంబనకు కొత్త దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు మంగళగిరిలో ప్రారంభించనున్నారు.ఉగాది కానుకగా తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని సుమారు 11.16 లక్షల దివ్యాంగులు ప్రత్యక్షంగా లబ్ధి పొందనున్నారు. అదేవిధంగా సహాయకులతో కలిపి మొత్తం 12.76 లక్షల మందికి ఈ పథకం ప్రయోజనం చేకూరనుంది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొననున్నారు.రాష్ట్రంలోని దివ్యాంగులకు పెద్ద ఊరట కలిగించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు మంగళగిరిలో ప్రారంభించనున్నారు. ఉగాది కానుకగా తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నారు.ఈ పథకం కింద రాష్ట్రంలోని 11.16 లక్షల దివ్యాంగులు లబ్ధి పొందనుండగా, సహాయకులతో కలిపి మొత్తం 12.76 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి ఈ సదుపాయం వర్తిస్తుంది. వారితో పాటు వచ్చే సహాయకులకు 50 శాతం టికెట్ రాయితీ కల్పించనున్నారు.పథకం ప్రారంభ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొననున్నారు.ప్రారంభోత్సవం అనంతరం సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ తదితరులు దివ్యాంగులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి, అనంతరం వారితో ఆత్మీయంగా భోజనం చేయనున్నారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కూడా ఇదే రోజున ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ప్రజా ప్రతినిధులు దివ్యాంగులతో కలిసి బస్సు ప్రయాణం చేసి, వారితో భోజనం చేయడం ప్రత్యేకతగా నిలవనుంది.ఈ పథకం అమలుకు ప్రతి ఏడాది రూ.207 కోట్లను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించనుంది. 4 నుంచి 21 వర్గాల దివ్యాంగులను ఈ పథకం పరిధిలోకి తీసుకురావడం ద్వారా మరింత విస్తృత ప్రయోజనం కల్పించనున్నారు.

ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందిస్తున్న 'స్త్రీ శక్తి' పథకం విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఈ పథకాన్ని తీసుకురావడం ప్రభుత్వం సంక్షేమానికి ఇచ్చిన ప్రాధాన్యతను సూచిస్తోంది.గత డిసెంబర్ 3న దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రకటించిన ఈ పథకాన్ని ఇప్పుడు అమల్లోకి తీసుకువస్తూ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది.

దివ్యాంగుల కోసం ప్రత్యేక సదుపాయాలు : 'దివ్యాంగ శక్తి' పథకం కింద 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నారు. అలాగే వారితో పాటు వచ్చే సహాయకులకు 50 శాతం టిక్కెట్ రాయితీ ఇవ్వనున్నారు.4 నుంచి 21 వర్గాల దివ్యాంగులను ఈ పథకం పరిధిలోకి తీసుకురావడం విశేషం. రాష్ట్రంలో ప్రజా రవాణా సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఈ పథకం అమలుకు ప్రతి సంవత్సరం సుమారు రూ.207 కోట్లను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించనుంది.

ప్రారంభ వేడుకలో ప్రత్యేక ఆకర్షణ : మంగళగిరిలో జరిగే ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేష్, పీవీఎన్ మాధవ్లు దివ్యాంగులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించనున్నారు. అనంతరం దివ్యాంగులతో ఆత్మీయంగా భోజనం చేయనున్నారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కూడా ఇదే రోజున ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. వారు కూడా దివ్యాంగులతో కలిసి బస్సు ప్రయాణం చేసి, వారితో భోజనం చేయనున్నారు.

'స్త్రీ శక్తి' తర్వాత 'దివ్యాంగ శక్తి' : ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందిస్తున్న 'స్త్రీ శక్తి' పథకం రాష్ట్రంలో విజయవంతమైంది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 52 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదు కాగా, ప్రభుత్వం రూ.1826 కోట్లకు పైగా ఖర్చు భరించింది. అదే స్ఫూర్తితో ఇప్పుడు దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా 'దివ్యాంగ శక్తి' పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చింది ప్రభుత్వం.

ప్రకటన నుంచి అమలు వరకు : గత సంవత్సరం డిసెంబర్ 3న దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రకటించారు. ఇప్పుడు ఆ హామీని అమల్లోకి తీసుకురావడం ద్వారా ప్రభుత్వం దివ్యాంగుల పట్ల తన కట్టుబాటును మరోసారి చాటుకుంది. దివ్యాంగుల స్వేచ్ఛాయుత ప్రయాణానికి, సమాజంలో సమాన అవకాశాలకు 'దివ్యాంగ శక్తి' పథకం కీలక అడుగుగా మారనుంది. ఇది కేవలం ప్రయాణ సౌకర్యం మాత్రమే కాదు... దివ్యాంగుల గౌరవం, స్వాభిమానాన్ని పెంచే సామాజిక సంక్షేమ కార్యక్రమంగా నిలుస్తోంది.



## మే 15లోపు
# ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలి

- ఓఅండ్ ఎం పనులపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- ఖరీఫ్‌కు ముందే కాలువలు, గేట్లు సిద్ధం చేయాలి
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంపై మంత్రి విమర్శలు
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి :రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వహణ పనులను వేగవంతం చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులకు ఆదేశించారు. ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులపై ఇరిగేషన్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో కడా కమిషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చీఫ్ ఇంజినీర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. కాలువల్లో పూడిక తొలగించకపోవడం, గేట్లు, షట్టర్లకు మరమ్మత్తులు చేయకపోవడం వల్ల నీటిపారుదల వ్యవస్థ దెబ్బతిందని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో నిర్వహణ కోసం రూ.200 కోట్లు కూడా ఖర్చు చేయలేదని విమర్శించిన మంత్రి, కూటమి ప్రభుత్వం మొదటి రెండేళ్లలోనే రూ.878 కోట్లు మంజూరు చేసి ఖర్చు చేసినట్లు తెలిపారు.రాబోయే 2026 ఖరీఫ్ సీజన్ను దృష్టిలో ఉంచుకుని, నీటిపారుదల వ్యవస్థలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. మే 15 నాటికి అన్ని అత్యవసర పనులు నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.అలాగే చెరువుల్లో పూడిక తీయబడిన మట్టిని రైతులకు క్యూబిక్ మీటర్కు రూ.1కే అందించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు.రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇరిగేషన్ రంగాన్ని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# జగన్నాటకాలు అన్నీ ప్రజలకు తెలుసు



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి :ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి వైఎస్ జగణ మోహన్ రెడ్డి పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. వివేకానంద రెడ్డి హత్య కేసులో నిజాలను దాచేందుకు వైఎస్ అర్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఆరోపించారు.మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి అనగాని మాట్లాడుతూ, చెల్లెలి బాధపై స్పందించకుండా నిందితులతో ప్రెస్మీట్లు పెట్టించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. బాబాయ్ను హత్య చేసిన వారిని కాపాడేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వాస్తవాలను వక్రీకరించారని, అధికారంలో ఉన్నప్పుడు నిజాలను ప్రజల ముందుకు తేలనివ్వలేదని విమర్శించారు. అధికారం కోల్పోయిన తర్వాత బలప్రదర్శన చేస్తూ ప్రజలపై ప్రేమ చూపిస్తున్నట్టు నటిస్తున్నారని అన్నారు.జగన్ చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మకపోవడంతోనే ఎన్నికల్లో పార్టీ కేవలం 11 సీట్లకు పరిమితమైందని మంత్రి వ్యాఖ్యానించారు. వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించిన గత వ్యాఖ్యల వీడియోలను ప్రదర్శిస్తూ, జగన్ మరియు అవినాష్ రెడ్డి మాటల్లో విరుద్ధతలు ఉన్నాయని పేర్కొన్నారు.రాష్ట్ర అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం నిజాయితీగా పనిచేస్తోందని, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి అనగాని స్పష్టం చేశారు.

# ఏపీలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- మంగళగిరి సమీపంలో ఏపీఈడీబీ నూతన కార్యాలయం ప్రారంభం
- ఒప్పందాలు కాదు.. పెట్టుబడులు కార్యరూపం దాల్చాలి
- ప్రపంచ దిగ్గజ సంస్థలు ఏపీ వైపు.. వేగం పెంచాలని పిలుపు
- ప్రతి ప్రాజెక్ట్ గ్రౌండింగ్‌పై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి :రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మంగళగిరి సమీపం చినకాకానిలోని మయూరి టెక్ పార్కో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్మెంట్ బోర్డు ( ఏపీఈడీబీ) నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అంతకు ముందు టెక్ పార్క్ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్కు అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యాలయం మొత్తం పరిశీలించిన ఆయన, ఏపీఈడీబీ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఇకపై రాష్ట్రంలో పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. "ఒప్పందాలు కుదుర్చుకోవడం కాదు, అవి భూమిపై అమలు కావడం ముఖ్యం. యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడం మన కర్తవ్యం" అని తెలిపారు.యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని గుర్తుచేసుకుంటూ, జీడీ నెల్లూరులో కలిసిన మోహన అనే మహిళ ఉదాహరణను ప్రస్తావించారు. "ప్రభుత్వ సాయం అవసరం లేదని, పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తే చాలని ఆమె కోరింది. అదే మన లక్ష్యాన్ని మరింత బలపరిచింది" అని చెప్పారు.కూటమి ప్రభుత్వం కేవలం 20 నెలల్లోనే భారీ పెట్టుబడులను ఆకర్షించిందని మంత్రి పేర్కొన్నారు. దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి రావడం గర్వకారణమన్నారు. ఈడీబీ బృందాన్ని అభినందిస్తూ సీఈవో సాయికాంత్ వర్మను ప్రత్యేకంగా ప్రశంసించారు.

ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయి : గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయని, ఇది రాష్ట్రానికి విశ్వసనీయత పెరిగిందని తెలిపారు. రిలయన్స్ సీబీజీ ప్రాజెక్ట్తో పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు.ఇప్పటికే గుర్తించిన 22 క్లస్టర్లలో అధికారులు నిపుణులుగా మారాలని సూచించిన మంత్రి, ప్రతి ప్రాజెక్ట్ గ్రౌండింగ్ తప్పనిసరి అని హెచ్చరించారు. "ఏ ప్రాజెక్ట్ ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా కాపాడాలి. ప్రతి ప్రాజెక్ట్కు సమీక్ష ఉంటుంది" అని స్పష్టం చేశారు.ఈ నెల 23న రెండో స్టీల్ సిటీకి శంకుస్థాపన చేస్తున్నామని వెల్లడించిన ఆయన, భవిష్యత్తులో మరిన్ని స్టీల్ సిటీల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయని, ఏప్రిల్ చివరినాటికి ఉండవల్లి నుంచి సీడ్ యాక్సిస్ రోడ్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు."దేశం, రాష్ట్రం గర్వపడేలా ప్రతిఒక్కరూ పనిచేయాలి" అంటూ మంత్రి సిబ్బందికి పిలుపునిచ్చారు. ఏప్రిల్ చివరినాటికి ఉండవల్లి నుంచి సీడ్ యాక్సిస్ రోడ్ అందుబాటులోకి వస్తుంది. ప్రతిఒక్కరం ఎంతో కష్టపడుతున్నాం. దేశం, రాష్ట్రం, ఈడీబీ గర్వపడే విధంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని ఈ సందర్భంగా మంత్రి దిశానిర్దేశం చేశార

ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్ ఎమ్. అభిషిక్త కిషోర్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

# మైలవరం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి లోకేష్

- మధ్యాహ్న భోజనం నాణ్యత స్వయంగా పరిశీలన
- తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవు
- విద్యార్థుల అభ్యసన, సామర్థ్యాల మెరుగుకు చర్యలు చేపట్టాలి



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : ఎన్టీఆర్ జిల్లా, మైలవరం దేవునిచెరువు తారకరామా నగర్ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల మధ్యాహ్న భోజనం బాగాలేదంటూ పాఠశాల హెచ్ఎం డ్రామా ఆడించిన ఘటన నేపథ్యంలో మంత్రి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తిని నాణ్యతను పరిశీలించారు. కొత్తగా ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ అందిస్తున్న భోజనం నాణ్యతపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగుందని విద్యార్థులు చెప్పారు. ఘటన జరిగిన రోజు, అంతకుముందు భోజనం ఎలా ఉందని విద్యార్థులను మంత్రి అడిగారు. భోజనం బాగాలేకపోతే ముందు తల్లిదండ్రులకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. ఆ తర్వాత భోజనం నాణ్యతపై లీప్ యాప్ ద్వారా తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకుంటామని చెప్పారు. ఇంకోసారి తప్పు జరగకుండా చూసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఇటీవల మధ్యాహ్న భోజనం సరిగా లేదంటూ ఆహారాన్ని విద్యార్థులు డస్ట్ బిన్ లో పడేసిన ఘటనపై సిబ్బందిని ఆరా తీశారు. భోజనం సిద్ధమయ్యాక ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యత పరిశీలిస్తున్నారా అని వాకబు చేశారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రశ్నించారు.

తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవు : ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మీపై పవిత్ర బాధ్యత ఉంది. చిన్న సమస్య ఉన్నా తెలుసుకోవాలి, పరిష్కరించాలి. తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని, నిర్లక్ష్యంగా ఎవరూ వ్యవహరించవద్దని మంత్రి హెచ్చరించారు. భోజనం నాణ్యతపై ప్రతివారం తల్లిదండ్రులకు ఫోన్ చేయాలని, ఐవీఆర్ఎస్ ద్వారా వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యాబోధన తీరు, పాఠశాల పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ప్రతి పాఠశాల తనకు ముఖ్యమేనని, అడ్మిషన్ల పెంపుతో పాటు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పాఠశాలలో ఉన్న అంగన్ వాడీ కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని, అంగన్ వాడీ కేంద్రం పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మైలవరం ఘటన నేపథ్యంలో విద్యార్థులకు అందే మధ్యాహ్న భోజనం పథకంపై ఇటీవల సమీక్షించిన మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యంగా లేకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.భోజనం బాగాలేకపోతే ముందు తల్లిదండ్రులకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. ఆ తర్వాత భోజనం నాణ్యతపై లీప్ యాప్ ద్వారా తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకుంటామని చెప్పారు. ఇంకోసారి తప్పు జరగకుండా చూసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఇటీవల మధ్యాహ్న భోజనం సరిగా లేదంటూ ఆహారాన్ని విద్యార్థులు డస్ట్ బిన్ లో పడేసిన ఘటనపై సిబ్బందిని ఆరా తీశారు. భోజనం సిద్ధమయ్యాక ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యత పరిశీలిస్తున్నారా అని వాకబు చేశారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రశ్నించారు. భోజనం సిద్ధమయ్యాక ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యత పరిశీలించాలని, బాగుందని నిర్ధారించాకే విద్యార్థులకు పెట్టాలని ఆదేశించారు. వారంలో ఒకరోజు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలో ఒక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలన్నారు. భోజనం గురించి విద్యార్థులు చెబితే తల్లిదండ్రులు వెంటనే లీప్ యాప్ ద్వారా ఫిర్యాదులు, సూచనలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

సమూల మార్పు కోసం త్వరలోనే సెంట్రలైజ్డ్ కిచెన్ వ్యవస్థను యుద్ధప్రాతిపదికన ఏర్పాటుచేయాలని ఆదేశించారు.



# కమర్షియల్ కట్...డొమెస్టిక్ ఫిట్ !

- రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ బ్లాక్ మార్కెట్ దందా
- చిరు వ్యాపారులపై గ్యాస్ కొరత ప్రభావం
- బ్లాక్‌లో రూ.2000- 2500కు డొమెస్టిక్ సిలిండర్లు
- వినియోగదారులే మధ్యవర్తులుగా మారుతున్న పరిస్థితి
- మాకు సంబంధం లేదంటున్న గ్యాస్ ఏజెన్సీలు
- అధికారుల మెరుపుదాడులు...కానీ ఫలితం ఎక్కడ ?

అర్. శ్రీనివాస నాయక్, ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి :రాష్ట్రంలో గ్యాస్ సరఫరా వ్యవస్థలో పెరుగుతున్న లోపాలు, పర్యవేక్షణ లోపాలు కారణంగా ఎల్పీజీ బ్లాక్ మార్కెట్ విస్తరిస్తున్నదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను పరిమితం చేయడంతో, హోటళ్లు, చిన్న వ్యాపారాలు డొమెస్టిక్ సిలిండర్ల పై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అవకాశంగా తీసుకున్న మధ్యదళారులు, వినియోగదారుల నుంచి డొమెస్టిక్ సిలిండర్లను నగదు ఆశ చూపించి సేకరించి, వాటిని బ్లాక్ మార్కెట్లో రూ.2000 నుంచి రూ.2500 వరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా గృహ అవసరాల కోసం ఉద్దేశించిన గ్యాస్ సిలిండర్లు వ్యాపార అవసరాలకు మళ్లిపోవడం వల్ల సాధారణ వినియోగదారులకు కూడా సరఫరాలో అంతరాయం కలుగుతోంది. మరోవైపు చిరు వ్యాపారులు అధిక ధరలకు గ్యాస్ కొనాల్సి రావడంతో వారి ఆదాయం తీవ్రంగా దెబ్బతింటోంది.గ్యాస్ ఏజెన్సీలు మాత్రం తమకు ఈ అక్రమాలతో సంబంధం లేదని, సరఫరా పూర్తిగా నిబంధనల ప్రకారమే జరుగుతోందని ప్రకటిస్తున్నాయి. అయితే "బ్లాక్ మార్కెట్కు గ్యాస్ ఎక్కడి నుంచి వస్తోంది?" అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అధికారులు అప్పుడప్పుడు మెరుపుదాడులు నిర్వహిస్తున్నప్పటికీ, అవి కేవలం చూపు దందాగా మిగిలిపోతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. దళారులపై కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది వినియోగదారులే స్వచ్ఛందంగా తమ సిలిండర్లను దళారులకు ఇచ్చి, బ్లాక్ మార్కెట్ చైన్లో భాగస్వాములవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. "తీగ లాగితే డొంక కదిలినట్లు" వినియోగదారుడే చివరికి అక్రమదారుడిగా మారుతున్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఈ సమస్య ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చిరువ్యాపారుల కష్టాలు పెరుగుతున్నాయి : హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ దుకాణాలు, చిన్న హోటళ్లకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేకపోవడంతో వారు డొమెస్టిక్ సిలిండర్లపై ఆధారపడాల్సి వస్తోంది.కానీ డొమెస్టిక్ సిలిండర్లను కూడా బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీని వల్ల చిన్న వ్యాపారుల ఖర్చులు పెరిగి, ఆదాయం తగ్గిపోతోంది. కొందరు వ్యాపారాలు మూతపడే పరిస్థితి కూడా ఏర్పడిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్లాక్ మార్కెట్ దందా జోరు : ప్రస్తుతం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్లో రూ.2000 నుంచి రూ.2500 వరకు అమ్ముడవుతున్నాయి.దళారులు వినియోగదారులకు నగదు ఆశ చూపించి వారి వద్ద నుంచి సిలిండర్లు సేకరించి, వాటిని వ్యాపారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.ఇలా గృహ అవసరాలకు కేటాయించిన గ్యాస్, వ్యాపార అవసరాలకు మళ్లిపోవడం వల్ల అసలు వినియోగదారులకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

వినియోగదారులే కీలక పాత్ర : ఈ వ్యవహారంలో అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే... కొంతమంది వినియోగదారులే స్వచ్ఛందంగా తమ గ్యాస్ సిలిండర్లను దళారులకు ఇవ్వడం."తీగ లాగితే డొంక కదిలినట్లు" చివరికి వినియోగదారుడే అక్రమ దందాలో భాగస్వామి అవుతున్న పరిస్థితి నెలకొంది.అదే సమయంలో "అందరూ శాఖాహారులే... గంప కింద కోళ్ళు మాయం" అన్న సామెతలా, అందరూ బాధ్యత తప్పించుకుంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏజెన్సీల పాత్రపై అనుమానాలు : గ్యాస్ ఏజెన్సీలు మాత్రం ఈ అక్రమాలతో తమకు ఎటువంటి సంబంధం లేదని ప్రకటిస్తున్నాయి. సరఫరా పూర్తిగా నిబంధనల ప్రకారమే జరుగుతోందని చెబుతున్నాయి.అయితే బ్లాక్ మార్కెట్లో పెద్ద ఎత్తున గ్యాస్ అందుబాటులో ఉండటం, ధరలు రెండింతలు పెరగడం వంటి అంశాలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి."దళారులకు ఏజెన్సీల మద్దతు ఉందా?" అన్న ప్రశ్నకు స్పష్టత లేకపోవడం ప్రజల్లో అనుమానాలను మరింత పెంచుతోంది.

అధికారుల చర్యలు...ప్రశ్నార్థకం : అధికారులు అప్పుడప్పుడు మెరుపుదాడులు నిర్వహిస్తున్నప్పటికీ, అవి తాత్కాలికంగానే మిగిలిపోతున్నాయని ఆరోపణలు ఉన్నాయి.బ్లాక్ మార్కెట్ దందా పూర్తిగా అణచివేయడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షణలో లోపాలు, కఠిన చర్యల లోటు కారణంగా దళారులు మరింత రెచ్చిపోతున్నారని స్థానికులు అంటున్నారు.

కఠిన చర్యలే మార్గం : ఎల్పీజీ బ్లాక్ మార్కెట్ దందాను అరికట్టాలంటే అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలి. దళారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, వినియోగదారులలో అవగాహన కల్పించాలి.ప్రలోభాలకు లోనవుతున్న వారిపై హెచ్చరికలు జారీ చేయాలి. లేకపోతే ఈ అక్రమ దందా మరింత విస్తరించి, సాధారణ ప్రజలు, చిరువ్యాపారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు గ్యాస్ సరఫరా వ్యవస్థపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టి, దళారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలను ప్రలోభాలకు గురిచేసే వారిపై అవగాహన కల్పించడం, వినియోగదారుల బాధ్యతను గుర్తుచేయడం కూడా సమానంగా కీలకం. లేదంటే ఎల్పీజీ బ్లాక్ మార్కెట్ దందా మరింత విస్తరించే ప్రమాదం ఉంది.

ఎల్పీజీ సంక్షోభం..మెనూలు తగ్గించిన హోటళ్లు

రాష్ట్రంలో ఎల్పీజీ సంక్షోభం హోటల్ పరిశ్రమ పై తీవ్ర ప్రభావం చూపుతోంది. గ్యాస్ ధరలు భారీగా పెరగడం, కమర్షియల్ సిలిండర్ల అందుబాటు తగ్గడం వల్ల చిన్న, మధ్య తరహా హోటళ్లు తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇప్పటి వరకు విభిన్న వంటకాలతో వినియోగదారులను ఆకట్టుకున్న హోటళ్లు, ఇప్పుడు ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా తమ మెనూలను కుదించుకుంటున్నాయి. ఎక్కువ గ్యాస్ వినియోగం అవసరమయ్యే వంటకాలను పూర్తిగా తొలగించడం లేదా పరిమితం చేయడం జరుగుతోంది.

మెనూలు కుదింపు...ఆదాయం తగ్గింపు: హోటళ్లలో బిర్యానీలు, ఫ్రై ఐటమ్స్, స్పెషల్ వంటకాలు వంటి అధిక గ్యాస్ వినియోగం ఉన్న పదార్థాలను తగ్గిస్తున్నారు. దీంతో వినియోగదారులకు ఎంపికలు తగ్గిపోతుండగా, హోటళ్ల ఆదాయం కూడా పడిపోతోంది.కొన్ని చిన్న హోటళ్లు రోజువారీ నిర్వహణ ఖర్చులను భరించలేక మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి.

విద్యుత్ వంటకు మార్పు : గ్యాస్పై ఆధారాన్ని తగ్గించేందుకు హోటల్ యజమానులు విద్యుత్ ఆధారిత వంట పరికరాలపై దృష్టి సారిస్తున్నారు. ఇండక్షన్ స్టవ్లు, ఎలక్ట్రిక్ కుకింగ్ పరికరాలు వినియోగం పెరుగుతోంది.అయితే విద్యుత్ ఖర్చులు కూడా ఎక్కువగానే ఉండటంతో, ప్రభుత్వం నుంచి సబ్సిడీ ఇవ్వాలని హోటల్ యజమానులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి విజ్ఞప్తి : హోటల్ అసోసియేషన్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించి విద్యుత్ చార్జీలపై సబ్సిడీ ఇవ్వాలని, లేదా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాయి."గ్యాస్ ధరలు పెరుగుతుంటే వ్యాపారం నడపడం కష్టమవుతోంది. కనీసం విద్యుత్పై సబ్సిడీ ఇస్తే కొంత ఉపశమనం లభిస్తుంది" అని హోటల్ యజమానులు పేర్కొంటున్నారు.

వినియోగదారులపై ప్రభావం : హోటళ్లలో మెనూలు తగ్గడం, ధరలు పెరగడం వల్ల వినియోగదారులపై కూడా ప్రభావం పడుతోంది. తక్కువ ధరలకు లభించే ఆహారం కూడా క్రమంగా ఖరీదవుతోంది.ఎల్పీజీ సంక్షోభం కేవలం హోటల్ రంగానికే కాకుండా, వినియోగదారులపై కూడా ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని, ప్రత్యామ్నాయ శక్తి వినియోగాన్ని ప్రోత్సహించడం, వ్యాపారులకు ఆర్థిక సహాయం అందించడం అవసరం.

# సంపాదకీయం



suryaeditpage@gmail.com

## రక్షణ రంగంలో సరికొత్త విప్లవం

భారతదేశాన్ని రక్షణ రంగంలో ప్రపంచ అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో రూపొందించిన రక్షణ దార్శనికత 2047 ఒక బృహత్తర ప్రణాళికగా సాగుతోంది. స్వాతంత్ర్యం వచ్చి వంద ఏళ్లు పూర్తయ్యే నాటికి దేశాన్ని పూర్తిస్థాయిలో ఆత్మనిర్భర భారత్‌గా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ ప్రణాళికలో భాగంగా విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించి , స్వదేశీ సాంకేతికతతో అత్యాధునిక యుద్ధ విమానాలు , క్షిపణులు , జలాంతర్గాములను తయారు చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రక్షణ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా సరికొత్త ఆవిష్కరణలకు బాటలు వేస్తూ , మన సైనిక దళాలను ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైనవిగా తీర్చిదిద్దడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ఈ ప్రణాళిక వేగవంతం చేస్తోంది.

పరిశోధన , అభివృద్ధి విభాగంలో భారత్ తన వ్యూహాలను పూర్తిగా మార్చుకుంటోంది. రక్షణ పరిశోధన , అభివృద్ధి సంస్థతో పాటు విద్యా సంస్థలు , ప్రైవేటు స్టార్టప్ కంపెనీలను ఏకం చేస్తూ ఒక పటిష్టమైన వ్యవస్థను నిర్మిస్తోంది. కృత్రిమ మేధస్సు , క్వాంటం కంప్యూటింగ్ , అంతరిక్ష యుద్ధ తంత్రం వంటి సరికొత్త సాంకేతికతలను సైనిక అవసరాలకు అనుగుణంగా మలుచుకోవడానికి భారీగా నిధులు కేటాయిస్తున్నారు. కేవలం ఆయుధాల తయారీకే పరిమితం కాకుండా , భవిష్యత్తులో రాబోయే సైబర్ దాడులను సమర్థంగా ఎదుర్కోవడానికి అవసరమైన భద్రతా వ్యవస్థలను కూడా స్వంతంగా అభివృద్ధి చేసుకుంటున్నారు. ఈ రకమైన సాంకేతిక స్వయంప్రతిపత్తి ద్వారా యుద్ధ సమయంలో విదేశీ సాంకేతిక సాయం కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా భారత్ తనను తాను రక్షించుకోగలుగుతుంది.

రక్షణ దౌత్యం విషయంలో కూడా భారత్ తన పరిధిని విస్తృతం చేస్తోంది. ఆసియా , ఆఫ్రికా , హిందూ మహాసముద్ర తీర ప్రాంత దేశాలతో రక్షణ ఒప్పందాలను కుదుర్చుకుంటూ , ఆయా దేశాలకు మన దేశంలో తయారైన ఆయుధాలను ఎగుమతి చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్ని ఇవ్వడంతో పాటు , అంతర్జాతీయ స్థాయిలో భారత్ ఒక బాధ్యతాయుతమైన రక్షణ భాగస్వామిగా ఎదగడానికి దోహదపడుతుంది. మిత్రదేశాలతో కలిసి ఉమ్మడి విన్యాసాలు నిర్వహించడం , వ్యూహాత్మక ప్రాంతాలలో సైనిక స్థావరాల సౌకర్యాలను పంచుకోవడం ద్వారా హిందూ మహాసముద్ర ప్రాంతంలో చైనా వంటి దేశాల ఆధిపత్యాన్ని అడ్డుకోవడానికి భారత్ సిద్ధమవుతోంది. శాంతి స్థాపన కోసం పని చేస్తూనే , దేశ సార్వభౌమత్వానికి ముప్పు వాటిల్లితే తక్షణమే స్పందించేలా మన దౌత్య వ్యూహాలు రూపొందాయి. భారత రక్షణ దార్శనికతలో భాగంగా మానవ వనరుల అభివృద్ధి , సైనిక శిక్షణ పద్ధతులలో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. యుద్ధ తంత్రం మారుతున్న కొద్దీ కేవలం శారీరక దృఢత్వమే కాకుండా , సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సైనికుల అవసరం పెరుగుతోంది. ఇందుకోసం అగ్నిపథ్ వంటి పథకాల ద్వారా యువతను రక్షణ రంగంలోకి ఆహ్వానిస్తూ , వారికి అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ , కంప్యూటర్ విజ్ఞానంలో శిక్షణ ఇస్తున్నారు. భవిష్యత్తులో సైన్యం పరిమాణం కంటే వారి సామర్థ్యం , వాడే ఆయుధాల నాణ్యత ముఖ్యం కాబట్టి , ప్రతి సైనికుడిని ఒక డిజిటల్ వారియర్‌గా తీర్చిదిద్దడం ఈ ప్రణాళికలో ఒక ముఖ్య భాగం. దీనివల్ల సరిహద్దుల్లో మానవ ప్రాణనష్టం తగ్గడమే కాకుండా , సుదూర ప్రాంతాల నుండి శత్రువులను ఎదుర్కోవ డానికి వీలవుతుంది.

దేశీయంగా రక్షణ ఉత్పత్తుల తయారీ కేంద్రాలను (డిఫెన్స్ కారిడార్స్) ఉత్తరప్రదేశ్ , తమిళనాడు వంటి రాష్ట్రాల్లో వేగంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా చిన్న , మధ్య తరహా పరిశ్రమలకు పెద్దపీట వేస్తూ , విమానాల విడిభాగాలు , బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు , సమాచార వ్యవస్థలను ఇక్కడే తయారు చేసేలా ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. దీనివల్ల లక్షలాది మంది యువతకు ఉపాధి లభించడంతో పాటు , రక్షణ రంగానికి అవసరమైన సరఫరా గొలుసు (సప్లై చైన్) పూర్తిగా దేశంలోనే అందుబాటులోకి వస్తుంది. ప్రపంచంలోనే అతిపెద్ద రక్షణ తయారీ హబ్‌గా భారత్‌ను మార్చడం ద్వారా మన అవసరాలు తీర్చుకోవడమే కాకుండా , విదేశాలకు ఎగుమతి చేసి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడం ఈ విజన్ 2047 లక్ష్యం. అంతరిక్ష రక్షణ రంగం లో (స్పేస్ డిఫెన్స్) భారత్ తన పట్టును మరింత బిగించబోతోంది. శత్రు దేశాల ఉపగ్రహాల కదలికలను కనిపెట్టడం , మన ఉపగ్రహాలను దాడుల నుండి కాపాడు కోవడం కోసం ప్రత్యేక స్పేస్ కమాండ్‌ను బలోపేతం చేస్తున్నారు. సముద్ర గర్భంలో జరిగే కదలికలను పసిగట్టేందుకు అత్యాధునిక సోనార్ వ్యవస్థలు , మానవరహిత జలాంతర్గాములను అభివృద్ధి చేయడం ద్వారా నీటి అడుగున కూడా భారత్ తిరుగులేని శక్తిగా ఎదగనుంది. ఈ విధంగా భూమి , ఆకాశం , నీరు , అంతరిక్షం , సైబర్ అనే ఐదు రంగాల్లోనూ భారత్ సమాంతరంగా అభివృద్ధి చెందుతూ , 2047 నాటికి ఏ శత్రువుకైనా కంటిమీద కునుకు లేకుండా చేసే స్థాయికి చేరుకుంటుంది.

భారత రక్షణ వ్యవస్థలో స్వయం సమృద్ధిని సాధించే క్రమంలో ప్రభుత్వ రంగ సంస్థలు , ప్రైవేటు పరిశ్రమల మధ్య సమన్వయం ఒక కొత్త పుంతలు తొక్కబోతోంది. గతంలో కేవలం ప్రభుత్వ సంస్థలకే పరిమితమైన భారీ రక్షణ ప్రాజెక్టులలో ఇప్పుడు ప్రైవేటు సంస్థలు ప్రధాన భాగస్వాములుగా మారుతున్నాయి. దీనివల్ల అత్యాధునిక యుద్ధ ట్యాంకులు , ఫిరంగులు , రాడార్ వ్యవస్థల తయారీలో పోటీ పెరిగి నాణ్యతతో పాటు వేగం కూడా తోడవుతోంది. మేధో సంపత్తి హక్కులను దేశీయంగానే కలిగి ఉండటం ద్వారా , భవిష్యత్తులో మన సాంకేతికతను ఇతర దేశాలకు విక్రయించేటప్పుడు ఎటువంటి ఆంక్షలు లేకుండా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ భారత్‌కు లభిస్తుంది. ఇది రక్షణ రంగంలో కేవలం వినియోగదారుడిగా ఉన్న భారత్‌ను ఒక శక్తివంతమైన ఎగుమతిదారుగా మారుస్తుంది.

రక్షణ వ్యూహాలలో భాగంగా కృత్రిమ మేధస్సు ఆధారిత డ్రోన్ సమూహాలను (డ్రోన్ స్వార్మ్స్) అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇవి శత్రువుల వైమానిక రక్షణ వ్యవస్థలను ఛేదించడంలో , సరిహద్దుల్లో నిరంతర నిఘా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అలాగే క్షిపణి రక్షణ వ్యవస్థలను మరింత పటిష్టం చేస్తూ , సుదూర లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంతో ఛేదించే హైపర్ సోనిక్ క్షిపణుల తయారీలో భారత్ అగ్రరాజ్యాల సరసన నిలవనుంది. సముద్ర తీర భద్రతను మెరుగుపరచడానికి తీరప్రాంత పొడవునా సెన్సార్ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం ద్వారా , సముద్ర మార్గంలో జరిగే చొరబాట్లను ప్రాథమిక దశలోనే అడ్డుకునేలా నిరంతర నిఘా వ్యవస్థ రూపుదిద్దుకుంటోంది.

పర్యావరణ హితమైన రక్షణ వ్యవస్థల వైపు కూడా భారత్ అడుగులు వేస్తోంది. సైనిక స్థావరాలలో పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించడం , యుద్ధ నౌకలు , వాహనాలలో కర్బన ఉద్గారాలను తగ్గించే సాంకేతికతను ప్రవేశపెట్టడం వంటివి ఈ విజన్ 2047 లో అంతర్భాగంగా ఉన్నాయి. రక్షణ బడ్జెట్‌లో పరిశోధనలకు కేటాయించే వాటాను క్రమంగా పెంచుతూ , విదేశీ సాంకేతిక పరిజ్ఞానంపై రూపాయి కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేని స్థితికి చేరుకోవడమే ఈ ప్రణాళిక అంతిమ లక్ష్యం. ఈ సమగ్రమైన మార్పులు భారత రక్షణ రంగాన్ని ప్రపంచంలోనే అత్యంత ఆధునికమైన , సమర్థవంతమైన వ్యవస్థగా నిలబెడతాయి.మొత్తం మీద చెప్పాలంటే , 'భారత రక్షణ దార్శనికత 2047'అనేది కేవలం ఒక సైనిక ప్రణాళిక మాత్రమే కాదు , అది నవ భారత్ యొక్క ఆత్మగౌరవానికి , సార్వభౌమాధికారానికి ప్రతీకగా నిలుస్తుంది. స్వదేశీ పరిజ్ఞానం , అధునాతన సాంకేతికత , వ్యూహాత్మక దౌత్యం అనే మూడు స్తంభాల మీద నిర్మితమవుతున్న ఈ వ్యవస్థ రాబోయే కాలంలో అంతర్జాతీయ రక్షణ రంగంలో సరికొత్త సమీకరణాలను సృష్టించబోతోంది. ఎవరిపైనా ఆధారపడని శక్తివంతమైన సైనిక దళం , అత్యాధునిక ఆయుధాల ఎగుమతులు , శాంతిని కాపాడటంలో క్రియాశీలక పాత్ర ద్వారా భారత్ ప్రపంచ వేదికపై ఒక తిరుగులేని మహాశక్తిగా అవతరించనుంది. స్వాతంత్ర్య శతాబ్ది వేడుకల నాటికి ప్రతి భారతీయుడు గర్వపడేలా , సరిహద్దుల వద్ద శత్రువులకు సింహస్వప్నంగా మన రక్షణ వ్యవస్థ పరిపూర్ణతను సాధించడమే ఈ బృహత్తర లక్ష్యం యొక్క అంతిమ విజయం.



# ఆస్కార్ హోరు.. విజేతల జోరు

- అవార్డుల దక్కించుకోవటంలో పోటాపోటీ
- సత్తా చాటిన వన్ బాటిల్ ఆఫ్టర్ అనదర్, సిన్నర్స్ చిత్రాలు
- వేడుకలో రారాజుగా నిలిచిన వన్ బాటిల్ ఆఫ్టర్ అనదర్
- పలు సినిమాలు నామినేట్ అయినా నిలబడలేక పోయిన ఇండియన్ సినిమాలు
- ఈ ఏడాది వేడుకకు సరికొత్త కళను తీసుకొచ్చిన ప్రత్యక్ష సంగీత ప్రదర్శనలు

తేజస్విని
హైదరాబాద్

ప్రపంచ సినిమా రంగంలో అత్యున్నత శిఖరంగా భావించే 98వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో ఉన్న డాల్బీ థియేటర్ వేదికగా అంగరంగ వైభవంగా జరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన ఈ వేడుక భారత కాలమానం ప్రకారం 2026 మార్చి 16న ఉదయం ఘనంగా ముగిసింది. ప్రముఖ కమెడియన్ కోనన్ ఓబ్రియన్ తనదైన శైలిలో అద్భుతమైన టైమింగ్‌తో హాస్యం పండిస్తూ హోస్ట్‌గా ఈ కార్యక్రమాన్ని ఆద్యంతం రక్తికట్టించారు. ఈ ఏడాదంతా వన్ బాటిల్ ఆఫ్టర్ అనదర్, సిన్నర్స్ చిత్రాల మధ్య తీవ్ర పోటీ నెలకొనగా, చివరకు ఈ రెండు చిత్రాలే అవార్డుల పరంపరలో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించి సత్తా చాటాయి.

**విజేతలు :**

98వ ఆస్కార్ అవార్డుల్లో వన్ బాటిల్ ఆఫ్టర్ అనదర్, సిన్నర్స్ సినిమాలు అత్యధిక అవార్డులతో సత్తా చాటాయి. వన్ బాటిల్ ఆఫ్టర్ అనదర్ అత్యుత్తమ చిత్రంగా నిలవగా, ఆ చిత్రానికి పనిచేసిన పాల్ థామస్ ఆండర్సన్ బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే అవార్డులు అందుకున్నారు. ఇదే సినిమాకు సీన్ పెన్ బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా, కాసాండ్రా కులుకుండిస్ బెస్ట్ క్యాస్టింగ్, ఆండీ జుర్గెన్సెన్ బెస్ట్ ఫిల్మ్ ఎడిటింగ్ అవార్డులు గెలుచుకున్నారు. ఇక సిన్నర్స్ సినిమాలో అద్భుతంగా నటించిన మైఖేల్ బి. జోర్డాన్ బెస్ట్ యాక్టర్‌గా నిలవగా, రేయాన్ కూగ్లర్ బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్ ప్లే అవార్డును సొంతం చేసుకున్నారు. హామ్నెట్ చిత్ర తార జెస్సీ బక్లీ బెస్ట్ యాక్ట్రెస్‌గా, వెపన్స్ సినిమాలోని అమీ మాడిగన్ బెస్ట్ సపోర్టింగ్ యాక్ట్రెస్‌గా ఆస్కార్ దక్కించుకున్నారు.

సాంకేతిక, ఇతర ప్రధాన విభాగాల్లోనూ పలు సినిమాలు ఘనవిజయం సాధించాయి. సిన్నర్స్ సినిమాకు గాను ఆటమ్ దురాల్డ్ ఆర్కపావ్ బెస్ట్ సినిమాటోగ్రాఫర్‌గా, లుడ్విగ్ గోరాన్సన్ బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విజేతలుగా నిలిచారు. కేపాప్ డెమోన్ హంటర్స్ ఉత్తమ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్‌గా నిలవడంతో పాటు అందులోని గోల్డెన్ పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ అవార్డు వరించింది. సెంటిమెంటల్ వాల్యూ ఉత్తమ ఇంటర్నేషనల్ ఫీచర్‌గా, మిస్టర్ నోబడీ అగైన్స్ట్ పుతిన్ ఉత్తమ డాక్యుమెంటరీగా ఎంపికయ్యాయి. ఫ్రాంకెన్‌స్టీన్ సినిమా బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్, కాస్ట్యూమ్ డిజైన్, మేకప్, హెయిర్‌స్టైలింగ్ విభాగాల్లో అవార్డులను కైవసం చేసుకోగా, బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ ఆస్కార్ అవతార్: ఫైర్, యాష్ సినిమాకు దక్కింది.

**ముఖ్య విశేషాలు**

వన్ బాటిల్ ఆఫ్టర్ అనదర్ హవా: పాల్ థామస్ ఆండర్సన్ అద్భుత సృష్టి అయిన ఈ చిత్రం అత్యధికంగా ఆరు ఆస్కార్ అవార్డులను కైవసం చేసుకుని ఈ వేడుకలో రారాజుగా నిలిచింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు సహా పలు కీలక విభాగాల్లో ఈ సినిమా సత్తా చాటింది.సిన్నర్స్ రికార్డుల మోత: ఏకంగా 16 నామినేషన్లతో రికార్డు సృష్టించిన ఈ సినిమా నాలుగు అవార్డులను గెలుచుకుంది. మైఖేల్ బి. జోర్డాన్ అద్భుత నటన, రేయాన్ కూగ్లర్ రచనా తీరు, లుడ్విగ్ గోరాన్సన్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలిచాయి. చరిత్రలో తొలిసారి బెస్ట్ క్యాస్టింగ్: ఆస్కార్ అకాడమీ తన 98 ఏళ్ల చరిత్రలో మొట్టమొదటిసారిగా బెస్ట్ క్యాస్టింగ్ విభాగానికి అవార్డును ప్రవేశపెట్టింది. వన్ బాటిల్ ఆఫ్టర్ అనదర్ చిత్రానికి పాత్రల స్వభావానికి తగ్గట్లుగా అద్భుతమైన నటీనటులను ఎంపిక చేసినందుకు గాను కాసాండ్రా కులుకుండిస్ ఈ సరికొత్త చరిత్రకు నాంది పలుకుతూ తొలి అవార్డును అందుకున్నారు.

మహిళా కెమెరామెన్ సంచలనం: ఉత్తమ సినిమాటోగ్రఫీ విభాగంలో అవార్డు గెలుచుకున్న మొట్టమొదటి మహిళగా ఆటమ్ దురాల్డ్ ఆర్కపావ్ నిలిచి సరికొత్త చరిత్ర సృష్టించారు. సిన్నర్స్ చిత్రానికి ఆమె అందించిన విజువల్స్ ప్రేక్షకులను కట్టిపడేశాయి. అరుదైన టై (సమాన ఓట్లు): ఉత్తమ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో ఒక ఆసక్తికరమైన సంఘటన చోటు చేసుకుంది. ది సింగర్స్, టూ పీపుల్ ఎక్స్ఛేంజింగ్ సలైవా చిత్రాలు రెండు జ్యూరీ సభ్యుల నుంచి సరిగ్గా సమాన ఓట్లు సాధించాయి. దీనితో ఈ రెండు చిత్రాలకు సంయుక్తంగా అవార్డును పంచుకున్నారు. ఆస్కార్ చరిత్రలో ఇలా జరగడం ఇది కేవలం ఏడవసారి మాత్రమే కావడం గమనార్హం. ఈ వేడుకలో ప్రదర్శించిన ప్రత్యేక నివాళులు, ఇతర సాంకేతిక విభాగాల విశేషాలు ప్రేక్షకులను ఎంతగానో ఉద్వేగానికి గురిచేశాయి. గత ఏడాది సినీ ప్రపంచాన్ని వీడి వెళ్లిన మహనీయ-ులకు ఇన్ మెమోరియం విభాగం ద్వారా ఘనంగా నివాళులర్పించారు. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా కీర్తి గడించిన దిగ్గజ నటీనటులు, సాంకేతిక నిపుణుల సేవలను గుర్తుచేసుకుంటూ రూపొందించిన వీడియో అందరినీ కదిలించింది. అలాగే, ఈ ఏడాది ఆస్కార్ వేదికపై జరిగిన ప్రత్యక్ష సంగీత ప్రదర్శనలు వేడుకకు సరికొత్త కళను తీసుకొచ్చాయి. ముఖ్యంగా కేపాప్ డెమోన్ హంటర్స్ చిత్రంలోని గోల్డెన్ పాటకు వేసిన నృత్యాలు, ఆ పాటలోని శక్తివంతమైన గానం ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి.

మరోవైపు, సైంటిఫిక్ , టెక్నికల్ విభాగాల్లో అందించిన అవార్డులు సినిమా నిర్మాణంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను ప్రపంచానికి చాటిచెప్పాయి. కెమెరా లెన్స్‌ల తయారీలో, డిజిటల్ ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో కృషి చేసిన ఇంజనీర్లకు ఈ వేదికపై ప్రత్యేక గౌరవం దక్కింది. అవతార్: ఫైర్, యాష్ సినిమా కోసం వాడిన సరికొత్త మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ ఈ ఏడాది ప్రధాన చర్చనీయాంశంగా నిలిచింది. ముగింపు వేడుకలో అకాడమీ అధ్యక్షుడు మాట్లాడుతూ, రాబోయే కాలంలో మరిన్ని వైవిధ్యమైన కథలను, అంతర్జాతీయ సినిమాలను ఆస్కార్ వేదిక ప్రోత్సహిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో 98వ ఆస్కార్ వేడుకలు ఒక మధుర జ్ఞాపకంగా ముగిశాయి.

ఈ వేడుక ముగింపులో ప్రకటించిన ప్రత్యేక పురస్కారాలు సినీ లోకంలో సరికొత్త ఉత్తేజాన్ని నింపాయి. ముఖ్యంగా మానవతా దృక్పథంతో సామాజిక సేవ చేసిన సినీ ప్రముఖులకు ఇచ్చే జీన్ హెర్షోల్ట్ హ్యూమానిటేరియన్ అవార్డు ఈ ఏడాది పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసిన ఒక సీనియర్ దర్శకుడికి దక్కింది. సినిమా అనేది కేవలం వినోద సాధనం మాత్రమే కాదని, అది సమాజంలో మార్పు తెచ్చే శక్తివంతమైన ఆయుధమని ఈ పురస్కారం మ-రోసారి నిరూపించింది. వేదికపై అవార్డు గ్రహీతలు చేసిన ప్రసంగాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగాయి, ముఖ్యంగా కొత్తగా పరిశ్రమలోకి వచ్చే యువతీ యువకులకు పట్టుదలతో పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.

మరోవైపు, ఈ ఏడాది ఆస్కార్ వేడుకల్లో భారతీయ సినిమాల సందడి కూడా కనిపించింది. ఉత్తమ డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్ విభాగాల్లో భారతీయ ప్రతిభకు నామినేషన్ల రూపంలో గుర్తింపు లభించడం గమనార్హం. గ్లోబల్ సినిమా మార్కెట్‌లో దక్షిణాసియా చిత్రాల ప్రాముఖ్యత పెరుగుతోందని అకాడమీ సభ్యులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. రెడ్ కార్పెట్ మీద తారలు మెరిసిన తీరు, వారు ధరించిన అత్యాధునిక ఫ్యాషన్ దుస్తులు ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా నిలిచాయి. మొత్తానికి 98వ ఆస్కార్ వేడుకలు కేవలం విజేతల ప్రకటనతోనే కాకుండా, కళాత్మకత, సాంకేతికత, సామాజిక బాధ్యతల కలయికగా అద్భుతంగా ముగిశాయి.

ఈ వేడుక ముగిసిన అనంతరం జరిగిన విందు కార్యక్రమం, విజేతల సంబరాలు హాలీవుడ్ వీధుల్లో ప్రత్యేక కోలాహలాన్ని నింపాయి. అవార్డులు గెలుచుకున్న వారు తమ ఆనందాన్ని పంచుకుంటూ, ఈ విజయం తమ ఒక్కరిదే కాదని, తెర వెనుక కష్టపడిన వందలాది మంది సాంకేతిక నిపుణులదని కొనియాడారు. ముఖ్యంగా వన్ బాటిల్ ఆఫ్టర్ అనదర్ చిత్ర బృందం తమ ఆరు ఆస్కార్ల విజయంతో చరిత్ర సృష్టించిన క్షణాలను గుర్తుచేసుకుంటూ ఎంతో ఉద్వేగానికి లోనయ్యారు. ఈ సినిమా సాధించిన విజయం స్వతంత్ర చిత్రాలకు, కొత్త తరహా కథాంశాలకు పెద్ద పీట వేస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఈ వేడుకలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ప్రభావం కూడా స్పష్టంగా కనిపించింది. థియేటర్లలో విడుదలైన చిత్రాలతో పాటు ఓటిటి వేదికలపై నేరుగా విడుదలైన కొన్ని సినిమాలు కూడా కీలక విభాగాల్లో పోటీ పడటం విశేషం. ఇది సినిమా రంగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న మార్పులకు సంకేతంగా నిలిచింది. 98వ ఆస్కార్ వేడుకలు కేవలం విజేతల ప్రకటనతోనే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ కళాకారులందరినీ ఒకే వేదికపైకి చేర్చి, సినిమా అనే అద్భుత కళను గౌరవించడంతో ఘనంగా ముగిశాయి. వచ్చే ఏడాది 99వ ఆస్కార్ వేడుకల కోసం అప్పుడే సినీ లోకం ఆశగా ఎదురుచూడటం మొదలుపెట్టింది.

ఈ ఏడాది ఆస్కార్ వేడుకల వెనుక ఉన్న విశ్లేషణలు గమనిస్తే, భవిష్యత్తులో సినిమా నిర్మాణ శైలి ఎలా ఉండబోతుందో ఒక స్పష్టత వచ్చింది. ముఖ్యంగా తక్కువ బడ్జెట్‌తో నిర్మించినప్పటికీ, బలమైన కథాబలం ఉన్న చిత్రాలకు అకాడమీ పెద్దపీట వేయడం గమనార్హం. వన్ బాటిల్ ఆఫ్టర్ అనదర్ వంటి చిత్రాలు సాధించిన విజయం, భారీ ఖర్చు కంటే భావోద్వేగపూరితమైన కథలే ప్రేక్షకులకు, విమర్శకులకు చేరువవుతాయని నిరూపించాయి. ఈ వేడుక తర్వాత అంతర్జాతీయ సినీ విపణిలో ఆయా చిత్రాల వసూళ్లు ఒక్కసారిగా పెరగడం ఆస్కార్ అవార్డుకున్న ప్రాముఖ్యతను మరోసారి చాటిచెప్పింది.

అంతేకాకుండా, ఈసారి అవార్డుల ప్రదానంలో యువతకు, అనుభవజ్ఞులకు మధ్య ఒక చక్కని సమతుల్యత కనిపించింది. ఒకవైపు పాల్ థామస్ ఆండర్సన్ వంటి సీనియర్ దర్శకులు తమ అనుభవాన్ని చాటుకోగా, మరోవైపు రేయాన్ కూగ్లర్ వంటి యువ ప్రతిభావంతులు ఆధునిక ఆలోచనలతో అవార్డులు గెలుచుకున్నారు. ఈ వేడుక ముగిసినా, అందులో చర్చకు వచ్చిన అంశాలు, ప్రసంగాలు, సాంకేతిక ఆవిష్కరణలు రాబోయే కొన్నేళ్ల పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ఫిలిం మేకర్లకు ఒక దిక్సూచిలా పనిచేస్తాయి. దీంతో 98వ ఆస్కార్ ప్రయాణం కేవలం ఒక రాత్రి వేడుకగా కాకుండా, సినీ పరిశ్రమలో కొత్త అధ్యయనానికి పునాది వేస్తూ ముగిసింది.

98వ ఆస్కార్ వేడుకల అనంతరం హాలీవుడ్ విశ్లేషకులు ఈ ఫలితాలపై లోతైన చర్చలు మొదలుపెట్టారు. ముఖ్యంగా సిన్నర్స్ చిత్రానికి 16 నామినేషన్లు వచ్చినప్పటికీ, వన్ బాటిల్ ఆఫ్టర్ అనదర్ ఆరు కీలక అవార్డులను తన్నుకుపోవడం ఒక పెద్ద సంచలనంగా మారింది. ఇది కేవలం ఒక సినిమా విజయం మాత్రమే కాకుండా, కథా రచనలో వస్తున్న మార్పులకు సంకేతమని సినీ పండితులు భావిస్తున్నారు. ఈ వేడుక ముగిసిన తర్వాత జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో విజేతలు తమ భవిష్యత్తు ప్రాజెక్టుల గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు, ఇది వచ్చే ఏడాది జరగబోయే 99వ ఆస్కార్‌పై ఇప్పుడే అంచనాలను పెంచేసింది.

మరోవైపు, ఈ ఏడాది ఆస్కార్ వేదికపై కనిపించిన సాంకేతిక హంగులు తదుపరి తరం సినిమాలకు ఒక కొత్త పాఠంలా నిలిచాయి. వర్చువల్ రియాలిటీ, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి సినిమాలను ఎలా మరింత మెరుగుపరచవచ్చో ఈ వేదికపై నిరూపించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ పాఠశాలలు, విద్యార్థులు ఈ ఏడాది విజేతల పనితీరును ఒక కేస్ స్టడీగా తీసుకుంటున్నారు. దీంతో 2026 ఆస్కార్ వేడుకలు కేవలం అవార్డుల ప్రదానంతో ముగిసిపోకుండా, ప్రపంచ సినిమా భవిష్యత్తుకు ఒక కొత్త బాటను వేస్తూ ఘనంగా ముగిశాయి.

# కాగితాల మాయాజాలం.. ఆయుధానికి తుప్పు పట్టిందా?

ఫిరోజ్ ఖాన్,
9640466464

సమాచార హక్కు చట్టం-2005 ప్రజాస్వామ్యంలో పారదర్శకతను బలోపేతం చేయడానికి రూపొందించిన కీలక సాధనం. ప్రారంభ సంవత్సరాల్లో ఈ చట్టం ద్వారా అనేక అవినీతి అంశాలు వెలుగులోకి వచ్చి పరిపాలనా వ్యవస్థ లో బాధ్యతను పెంచాయి. అయితే తాజా గణాంకాలు పరిస్థితి మారుతున్నట్లు సూచిస్తున్నాయి. కేంద్ర సమాచార కమిషన్ వార్షిక నివేదిక (2022-23) ప్రకారం దేశవ్యాప్తంగా లక్షలాది ఆర్టీఐ దరఖాస్తులు పెండిం గ్‌లోనే ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని పెద్ద రాష్ట్రాల్లో కేసుల పెండింగ్ సంఖ్య గణనీయంగా ఉంది. చట్టం ప్రకారం 30 రోజులలోగా సమాధానం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, అనేక సందర్భాల్లో ఆలస్యం జరుగుతున్నట్లు ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతి దరఖాస్తుపై ఖర్చు చేస్తున్నప్పటికీ, పౌరులకు పూర్తి సమాచారం అందడంలో లోపాలు ఉన్నాయని విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఈ పరిస్థితి పారదర్శకత లక్ష్యాల సాధనలో సవాళ్లను చూపుతోంది.

**సెక్షన్ల వినియోగంలో వింత విన్యాసాలు**

సమాచారం అందించడంలో చట్టంలోని కొన్ని మినహాయింపు నిబంధనల వినియోగంపై తరచూ చర్చ జరుగుతోంది. ముఖ్యంగా సెక్షన్ 8(1)(జే) కింద వ్యక్తిగత సమాచారంగా పేర్కొంటూ కొన్ని వివరాలను నిరాకరించే ధోరణి కనిపిస్తోందని ఆర్టీఐ కార్యకర్తలు చెబుతున్నారు. అలాగే సెక్షన్ 8(1)(హెచ్) కింద విచారణకు ఆటంకం కలుగుతుందని పేర్కొనడం కూడా అనేక కేసుల్లో కనిపిస్తోంది. అయితే సుప్రీంకోర్టు (గిరీష్ రామచంద్ర దేశ్‌పాండే వర్సెస్ సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్, 2012) తీర్పులో ప్రజా సేవకుల సేవా వివరాలు కొన్ని సందర్భాల్లో ప్రజా ప్రయోజనానికి చెందుతాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో చట్ట నిబంధనల వినియోగంలో సమతుల్యత అవసరమనే అభిప్రాయం నిపుణుల్లో వ్యక్తమవుతోంది. సరైన మార్గదర్శకాలు క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలైతే పారదర్శకత మరింత బలోపేతం అవుతుందని విశ్లేషకులు సూచిస్తున్నారు.

**డిజిటల్ వ్యవస్థలో 'సర్వర్ డౌన్' సంస్కృతి**

డిజిటల్ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను ఆన్లైన్‌లో అందుబాటులోకి తేవడం లక్ష్యం. అయినప్పటికీ ఆర్టీఐ అమలులో మార్పులు సమానంగా ప్రతిబింబించడంలేదని అనుభవాలు సూచిస్తున్నాయి. సెక్షన్ 7(9) ప్రకా రం సమాచారం అందుబాటులో ఉన్న రూపంలో ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, కొన్ని కార్యాలయాల్లో సాంకేతిక పరిమితులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. "సర్వర్ సమస్యలు", "స్కానింగ్ సదుపాయాల కొరత" వంటి కారణాలు అప్పుడప్పుడు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో డిజిటలైజేషన్‌కు మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో ప్రాంతాలవారీగా తేడాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఫలితంగా పౌరులు డిజిటల్ మార్గాల్లో సమాచారం పొందడంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాంకేతిక వనరుల సమర్థ వినియోగం పెరిగితే సమస్యలు తగ్గే అవకాశముంది.

**ఫీజుల అంశంపై ఆందోళనలు**

ఆర్టీఐ చట్టం ప్రకారం సమాచారం కోసం సాధారణంగా తక్కువ ఫీజులు మాత్రమే వసూలు చేయాలి. అయితే కొన్ని సందర్భాల్లో అవసరమైనదానికంటే ఎక్కువ పేజీలు చూపించి ఫీజులు పెరిగినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ముఖ్యంగా చిన్న పరిమాణంలోని సమాచారం కోసం కూడా అధిక మొత్తాలు సూచించబడుతున్నాయని కార్యకర్తలు చెబుతున్నారు. డిజిటల్ కాపీల రూపంలో సమాచారం అందించడం సాధ్యమైనప్పటికీ, కొన్ని సందర్భాల్లో సాంకేతిక కారణాలతో ఆలస్యం జరుగుతోందని తెలుస్తోంది. ఈ పరిస్థితి సామాన్య పౌరులకు ఆర్థిక భారంగా మారే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సమాచారం అందుబాటులో ఉండాలి కానీ అది భారంగా మారకూడదనే అభిప్రాయం బలపడుతోంది. ఫీజుల వ్యవస్థ పారదర్శకంగా, సమంజసంగా అమలవడం అవసరం.

**బదిలీ ప్రక్రియలో భరతనాట్యం..**

సెక్షన్ 6(3) ప్రకారం అవసరమైతే దరఖాస్తులను సంబంధిత శాఖలకు బదిలీ చేయవచ్చు. అయితే ఈ ప్రక్రియలో ఆలస్యం జరుగుతున్నట్లు పౌరుల అనుభవాలు సూచిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఒక దరఖాస్తు పలుమార్లు విభాగాల మధ్య మారుతూ సమాధానం ఆలస్యమవుతోందని ఫిర్యాదులు ఉన్నాయి. చట్టం నిర్దేశించిన గడువులో సమాధానం అందకపోవడం వల్ల పౌరులు ఇబ్బందులు పడుతున్నారు. బాధ్యత స్పష్టంగా నిర్ణయించకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమయపాలనతో అమలు చేస్తే పౌరుల నమ్మకం పెరుగుతుంది. బాధ్యతాయుత విధానాలు అవసరం.

**అప్పీళ్ల వ్యవస్థలో ఆలస్యం**

సమాచారం అందకపోతే అప్పీల్ చేసే అవకాశం ఉన్నప్పటికీ, ఆ ప్రక్రియలో



కూడా ఆలస్యం ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషన్ల వద్ద గణనీయ సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని నివేదికల ప్రకారం కేసుల పరిష్కారానికి నెలల నుండి సంవత్సరాల వరకు సమయం పడుతోంది. సెక్షన్ 20 ప్రకారం గడువులోగా సమాచారం ఇవ్వని అధికారులపై రోజుకు రూ. 250 చొప్పున జరిమానా విధించే అధికారం ఉన్నా, అది కేవలం 2% కేసుల్లో మాత్రమే అమలవుతోంది. ఫలితంగా అధికారులు చట్టాన్ని ఉల్లంఘించినా తమకేమీ కాదనే ధోకడతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఆలస్యమైన న్యాయం అంటే న్యాయం కానట్లే అనే భావన ఆర్టీఐ కార్యకర్తల్లో బలంగా నాటుకుపోతోంది. ఈ పరిస్థితి చట్టం యొక్క ప్రభావాన్ని తగ్గించడమే కాకుండా పౌరులను నిరుత్సాహానికి గురిచేస్తోంది.

**పరిష్కార దిశగా చర్యలు అవసరం**

సమాచార హక్కు చట్టం ప్రభావవంతంగా కొనసాగాలంటే కొన్ని కీలక చర్యలు అవసరం. సమాచార కమిషన్లలో ఖాళీలను భర్తీ చేసి కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయడం ముఖ్యమైన అంశం. సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు కీలక సమాచారాన్ని స్వయంచాలకంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలి. డిజిటలైజేషన్‌ను వేగవంతం చేసి పౌరులకు సులభంగా సమాచారం అందే విధంగా చర్యలు తీసుకోవాలి. ఫీజుల వ్యవస్థ పారదర్శకంగా అమలు కావాలి. పౌరులు కూడా చట్టబద్ధమైన మార్గాల్లో తమ హక్కులను వినియోగించుకోవాలి. ఈ విధంగా సమష్టి కృషితో పారదర్శకతను బలోపేతం చేయడం సాధ్యమవుతుంది.

## ప్రజాప్రతినిధులను నియంత్రించలేని ప్రభుత్వాలు

(డా. ముచ్చుకోట . సురేష్ బాబు – 9989988912)

అలిశెట్టి ప్రభాకర్ అన్నట్లు దొంగ సినిమా నిర్మాతలకి వేరే దిక్కేది! సగటు తెలుగు ప్రేక్షకుడి జేబే రోజు దక్కేదీ జ రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తనను బలవంతంగా లొంగదీసుకుని వాడుకున్నాడని హర్ష వీణ అనే ప్రభుత్వ ఉద్యోగి రోజుకో వీడియో రిలీజ్ చేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. టీడీపీకి చెందిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ ఓ మహిళతో వీడియో కాల్ లో మాట్లాడుతూ ముద్దులు పెడుతున్న దృశ్యాలు గతంలో వైరల్ అయ్యాయి. దీంతో ఆయనపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ వీడియో వ్యవహారం తేల్చాలని ఆయన పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అదే సమయంలో వీడియోలో ఉన్న టీడీపీ మహిళా నేత గుంటుపల్లి వాణి ఓ వీడియో రిలీజ్ చేశారు. తన భర్తతో వీడియో కాల్ మాట్లాడిన వీడియోను డీప్ ఫేక్ చేసి ఎమ్మెల్యేను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇక సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి అదుమూలం పై నమోదైన లైంగిక వేధింపుల కేసులో ఎంఎల్ఏ ని పార్టీ కార్యక్రమాల నుంచి పక్కకు తప్పించారు ఆముదాలవలస ఎంఎల్ఏ కూన రవికుమార్ తనను శారీరికంగా లైంగికంగా వేధించాడని స్వయానా బాధితురాలు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య ఆరోపిస్తే నిజానిజాలు తేల్చాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. ఇక బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్ రెడ్డి డ్రగ్స్ కేసులో జైల్లో ఉన్నారు. తాజాగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మొయినాబాద్ ఫామ్ హౌస్ లో డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడ్డాడు. డ్రగ్స్ సేవించినట్లు పాజిటివ్ వచ్చినట్లు పోలీసు అధికారులు తెలియజేసారు. ఇక టీవీ 5 అధినేత తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడు మహిళలతో రంకు భాగోతం వీడియోలో వైరల్ అవుతున్న చర్యలకు ఉపక్రమించని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. లడ్డు కల్తీ పై స్పందించిన సనాతన వాదులు మహిళలపై చిన్నారులపై జరుగుతున్న లైంగిక హింసలపై స్పందన కరువయ్యింది. రాజమండ్రిలో కల్తీ పాలు తాగి 15 మంది మరణించారు ఇంకా ఐదుగురు వెంటిలేటర్ పై ఉన్నారు. 2024 నుంచి బాణాసంచా పేలుళ్లలో చనిపోయిన వారి సంఖ్య 60, మొన్న వేటపాలెం ఘటన మరువక ముందే నిన్న గోపాలపట్నం లో పేలుడు. ఒక వైపు విద్యార్థులలో మానవ విలువలు సంస్కృతి వారసత్వం ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు చాగంటి లాంటి ఘనాపాటిని సలహాదారులుగా నియమించారు. మరో వైపు ఎర్ర చందనం స్మగ్లింగ్ చేస్తున్న ఒక గజదొంగ కథ ప్రేరణగా తీసిన సినిమాకు 1300 టికెట్టు పెట్టి ప్రేక్షకుల నుంచి డబ్బు వసూలు చేసుకోవడానికి ప్రభుత్వం పర్మిషన్ ఇస్తున్నారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారికి పారితోషకం ఇస్తున్నారు. అసలే బెట్టింగ్, ఆన్లైన్ గేమ్స్, జూదం, మోసం అమ్మాయిలపై అఘాయిత్యాలు, దొంగ రవాణా, గుడుంబా, గంజాయి, ఎర్ర చందనం స్మగ్లింగ్, వ్యభిచార రాకెట్, దందాలతో పోలీసులు సతమవుతుంటే విశృంకలకత్వాన్ని, హింస, స్మగ్లింగ్, ధూమపానం, మద్యపానం దొంగ పనులు చేసేవారిని హీరోగా తెరకెక్కించి ఏ మాత్రం సెన్సార్ లేకుండా ఎక్కడ తగ్గకుండా తగ్గేదెలా జుగుప్సాకరమైన, అశ్లీల సన్నివేశాలను యువత పెడదోవ కు ప్రేరేపించే సినిమాలు సెన్సార్ బోర్డు కళ్ళు మూసుకొని సర్టిఫై చేస్తున్నారు, మరోవైపు హిందూ మనోభావాలు లవ్ జిహాద్ అని గగ్గోలు పెట్టే మతతత్వవాదులకు అశ్లీలత కనిపించకపోవడం సిగ్గుచేటు. పత్రికలు కూడా సినిమా రివ్యూలలో అశ్లీలతను రాయకుండా దర్శకుడిని పొగుడుతూ, సెకండాఫ్‌లోని జాతర ఎపిసోడ్‌లో ఇదిరా పెళ్లం అంటే అనేట్టు చూపించాడు అంటూ పుంఖాను పుంఖాలుగా రాస్తున్నారు. దేశంలో మహిళలపై అకృత్యాలు గతంలో జరిగాయి, ఇప్పుడు అంతకన్నా ఘోరంగా జరుగుతున్నాయి. గత రెండు మూడు సంవత్సరాలుగా మతం పేరుతో, వర్గం పేరుతో మహిళలపై దాడులు హింస అత్యాచారాలు హత్యలు మితిమీరి పోయాయి. మార్పు ఇంటి నుంచి మొదలవ్వాలి. ద్వేషం అసూయ అజ్ఞానం అవిద్య అవివేకం మెండుగా ఉన్న వారు అధికారంలో ఉన్నప్పుడు సమస్యకు పరిష్కారం దొరకదు. నిత్యం ఎక్కడో ఒక చోట మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఎన్ని చట్టాలు ఉన్నా, అనేక కారణాలతో తప్పించుకుంటున్నారు. మణిపూర్ లో మహిళలను నగ్నంగా ఊరేగించి హత్య చేశారు, బిల్కిస్ బానో గ్యాంగ్ రేప్ చేసిన వారికి క్షమాభిక్ష ప్రకటించారు, దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన రెసిలర్ల పై లైంగిక వేధింపులకు గురిచేసిన వారిని అందలమెక్కించిన ఘనత మనది. 34 మంది కొరియన్లు లైంగికంగా వాడుకున్న బాలేష్ ధన్కర్ ఓవర్సీస్ బీజేపీ అధ్యక్షుడు. మహిళలు స్కర్టులు వేయడంతో అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఒక పెద్దాయన అంటారు. సభ్యసమాజం గౌరవించేలా మహిళల వస్త్రధారణ ఉండాలని ఒకాయన అన్నాడు. స్త్రీల పవిత్రతకు శీలాన్ని ముడిపెడుతూ సమాజం ఇచ్చిన ప్రాముఖ్యమే ఇటువంటి దాడులకు, భావజాలానికి కారణం. సాహిత్యంలో, సినిమాల్లో కూడా మహిళల పవిత్రతకు శీలంతో ముడిపెట్టారు. స్త్రీని అణచివేయాలంటే వారి లైంగికత, శరీర భాగాలపై దాడి చేయడమే వారికి సులభంగా దొరికే ఆయుధం. మహిళను ఒక లైంగిక వస్తువుగా, రంగు, అందంతో పోల్చి చూస్తారు. మహిళ అంటే అందం, పురుషుడు అంటే డబ్బు, అధికారానికి ప్రతిబింబంగా చూసినంత వరకు ఈ ధోరణి మారాలి.

జ చట్ట సభలు వ్యవస్థల్ని దిశా నిర్దేశం చేస్తాయి, ప్రజా ప్రతినిధులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అసెంబ్లీలో శాసనసభ్యుల చిల్లర చేష్టలు, జిగుప్సాకరమైన పదజాలం, వికృత చేష్టలు, సంబంధాలను చర్చలోకి తెస్తున్నారు.




# పుతిన్ నీడలో సుప్రీం లీడర్ ?



న్యూఢిల్లీః ఇరాన్– అమెరికా,ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ఇప్పుడు మూడో వారంలోకి అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్, అయతొల్లా అలీ ఖమేనీ కుమారుడు మొజ్తబా ఖమేనీ ఆచూకీ కోసం అన్వేషణ కొనసాగుతోంది. గాయపడిన ఇరాన్ నూతన సుప్రీం లీడర్ ఆచూకీపై ఊహాగానాలు పెరుగుతున్నాయి.యుద్ధంలో గాయపడిన 56 ఏళ్ల ఖమేనీ ప్రస్తుతం కోమాలో ఉన్నారని పలు నివేదికలు చెబుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం "ఖమేనీ బ్రతికిలేరు" అని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితి ఇరాన్ లో రాజకీయ అస్థిరతకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. తాజా నివేదికల ప్రకారం.. అమెరికా ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ దాడుల అనంతరం ఖమేనీకి శస్త్రచికిత్స అవసరమైంది. ప్రస్తుతం ఆయన మాస్కోలో ఉన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసాల్లో ఒకదానికి అనుబంధంగా ఉన్న ఒక ప్రైవేట్ వైద్య సదుపాయంలో చికిత్స పొందుతున్నారని తెలుస్తోంది. ఖమేనీకి ప్రస్తుత యుద్ధం గురించి, తాను ఇరాన్ నూతన నాయకుడినని తెలియదని నివేదికలు సూచిస్తున్నాయి.కువైట్ దినపత్రిక అల్–జరీదా నివేదిక ప్రకారం.. మొజ్తబా ఖమేనీని రష్యన్ సైనిక విమానంలో మాస్కోకు తరలించారు. ఖమేనీ ఆరోగ్యం, భద్రతా కారణాల దృష్ట్యా ఇది అత్యంత రహస్య ఆపరేషన్ అని ఆ నివేదిక వెల్లడించింది. రష్యా రాజధాని చేరుకున్న తర్వాత ఖమేనీకి శస్త్రచికిత్స జరిగిందని, ప్రస్తుతం ఆయన పుతిన్ నివాసాలలో ఒకదానిలోని ప్రైవేట్ వైద్య సదుపాయంలో కోలుకుంటున్నారని అల్–జరీదా తన కథనంలో పేర్కొంది. నూతన ఇరాన్ సుప్రీం లీడర్ కు సన్నిహితుడైన ఉన్నత స్థాయి వర్గాలను ఉటంకిస్తూ ఈ సమాచారాన్ని అందించింది.అమెరికా–ఇజ్రాయెల్ దాడుల మొదటి రోజున ఖమేనీకి తీవ్ర గాయాలయ్యాయని వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్‌లో కొనసాగుతున్న దాడుల మధ్య తగిన వైద్య సదుపాయాలు, నిపుణుల పర్యవేక్షణ కష్టంగా మారడంతో అతనికి అత్యవసర ఆసుపత్రి చికిత్స అవసరమైంది. ముఖ్యంగా ఇజ్రాయెల్ నూతన సుప్రీం లీడర్‌ను లక్ష్యంగా చేసుకుంటామని ప్రకటించిన తర్వాత ఖమేనీ ఆరోగ్యంపై ఆందోళనలు మరింత పెరిగాయి. 56 ఏళ్ల ఆయన ఆచూకీపై లీక్‌లు ఇరాన్ భద్రతకు పెద్ద సమస్యగా మారాయి. చికిత్సలో పాల్గొన్న పలువురు వైద్యులు, నిపుణులను ట్రాక్ చేస్తుండటంతో, రష్యాలో వైద్య సంరక్షణకు ఆమోదం లభించింది. అయితే, ఇరాన్, రష్యా అధికారులు ఇప్పటివరకు ఖమేనీని తరలించడం లేదా రష్యాలో ఆయనకు వైద్య చికిత్స అందించడంపై ఎటువంటి అధికారిక ధృవీకరణను అందించలేదు. ఈ అంశంపై అంతర్జాతీయ సమాజంలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. మార్చి 12న ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ తో ఫోన్ సంభాషణలో అధ్యక్షుడు పుతిన్ స్వయంగా ఖమేనీకి రష్యాలో చికిత్స అందించాలని ప్రతిపాదించారని నివేదికలున్నాయి. ఖమేనీ, ఇరాన్ అధికారులు రష్యా ప్రతిపాదనను జాగ్రత్తగా పరిశీలించి ఆమోదించారు.తర్వాత అతన్ని మాస్కోకు తరలించారు. అక్కడ రష్యన్ వైద్యులతో పాటు ఇరాన్ వైద్యుల బృందం ఖమేనీకి అత్యుత్తమ వైద్య సంరక్షణ అందించినట్లు సమాచారం. ఈ పరిణామం ఇరాన్–రష్యా సంబంధాల బలాన్ని మరోసారి చాటి చెప్పింది. అయితే, కొన్ని రోజుల క్రితం 'ది సన్' పత్రిక, వర్గాలను ఉటంకిస్తూ, ఖమేనీ ఇరాన్‌లోని సినా విశ్వవిద్యాలయ ఆసుపత్రిలో ఇంటెన్సివ్ కేర్‌లో ఉన్నారని, ఇరాన్ ఆరోగ్య మంత్రి మొహమ్మద్ రెజా జఫర్‌ఘండి పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని నివేదించింది. ఆ నివేదిక ప్రకారం, "నూతన సుప్రీం లీడర్‌కు ఒకటి లేదా రెండు కాళ్లు తొలగించారు. అతని కాలేయం పగిలింది. అతను కోమాలో ఉన్నట్లున్నారు." ఈ భయంకరమైన వివరాలు ఖమేనీ పరిస్థితిపై భయాందోళనలను మరింత పెంచుతున్నాయి. ఈ మేరకు ఇరాన్ నూతన సుప్రీం లీడర్ తన మొదటి బహిరంగ సందేశాన్ని నిజంగానే జారీ చేశారా అనే దానిపై తీవ్ర సందేహాలున్నాయి. సంస్కరణవాదులకు దగ్గరైన ఇరాన్ వర్గాల వారు ఏజే జరిబాకు ఈ విషయాన్ని తెలిపారు. ఇది దేశీయంగానూ చర్చనీయాంశమైంది.ఈ ప్రకటన ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ–జనరల్ అలీ లారిజానీ రాశారని అనుమానాలున్నాయి. ఎందుకంటే ఇది ఖమేనీ ఆరోపించిన ప్రసంగానికి ముందు ఆయన చేసిన అనేక వ్యాఖ్యలను పోలి ఉంది. ఖమేనీకి ప్రణాళికాబద్ధమైన సమావేశం గురించి తెలియజేయలేదని ఆ వర్గం తెలిపింది. అతను బహిరంగంగా కనిపించకపోవడం, ప్రసంగానికి సంబంధించిన ఆడియో రికార్డింగ్ లేకపోవడం ఈ సందేహాలను మరింత బలపరుస్తున్నాయి. ఇరాన్ నాయకత్వంలో గందరగోళం నెలకొందనే వాదనలకు ఇది ఆజ్యం పోస్తోంది.కొనసాగుతున్న బాంబార్డ్‌మెంట్ మధ్య అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ సుప్రీం లీడర్ గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఎన్‌బిసి న్యూస్‌తో మాట్లాడుతూ, ఖమేనీ ఆచూకీపై అడిగినప్పుడు, "అతను బ్రతికి ఉన్నాడో లేదో నాకు తెలియదు. ఇప్పటి వరకు ఎవరూ అతన్ని చూపించలేకపోయారు" అని అన్నారు. ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మరణ వార్తను "అవాస్తవం" అని అధ్యక్షుడు పేర్కొన్నారు. "అతను బ్రతికి లేడని నేను వింటున్నాను, ఒకవేళ అతను బ్రతికి ఉంటే, తన దేశం కోసం చాలా తెలివైన పని చేయాలి.. అది లొంగిపోవడం" అని ట్రంప్ స్పష్టం చేశారు.ఇరాన్ నూతన సుప్రీం లీడర్.. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఉన్నతాధికారులపై సమాచారం కోసం వాషింగ్టన్ $10 మిలియన్ల (సుమారు రూ. 92.58 కోట్లు) బహుమతిని ప్రకటించింది. ఇది ఇరాన్ నాయకత్వంపై పశ్చిమ దేశాల దృష్టిని తెలియజేస్తోంది.జెరూసలేం వర్గాల సమాచారం ప్రకారం.. ఇజ్రాయెల్ నిఘా విభాగం అంచనా ప్రకారం, ఖమేనీ మొదట అనుకున్నదానికంటే తీవ్రంగా గాయపడ్డారు. ఇరాన్ నుండి అతను బయలుదేరినట్లు టెల్ అవీవ్ వద్ద ధృవీకరించబడిన సమాచారం లేదని కూడా వారు పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన తమ సుప్రీం లీడర్ నుండి ఇరాన్ కమాండర్లు ఎటువంటి ఆదేశాలను అందుకోలేదని పలు ఇతర నివేదికలు సూచిస్తున్నాయి. ఇది సైనిక కార్యకలాపాలపై ప్రభావం చూపుతోందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యుద్ధం దెబ్బతిన్న దేశం లోపల నుండి మాట్లాడుతున్న ఒక ఇరాన్ అధికారి 'ది టెలిగ్రాఫ్'తో మాట్లాడుతూ, "మొజ్తబా గురించి ఎవరికీ ఏమీ తెలియదు, అతను బ్రతికి ఉన్నాడో, చనిపోయాడో లేదా ఎంత దారుణంగా గాయపడ్డాడో తెలియదు. అతను గాయపడ్డాడని మాత్రమే మాకు చెప్పారు. అతను ఇక్కడ లేనందున యుద్ధంపై అతనికి ఎటువంటి నియంత్రణ లేదు. చాలామంది కమాండర్లకు, లేదా మరింత కచ్చితంగా చెప్పాలంటే, అందరు కమాండర్లకు అతని గురించి ఎటువంటి సమాచారం లేదు" అని ఆ అధికారి వ్యాఖ్యానించారు. ఇది ఇరాన్ సైనిక నాయకత్వంలో నెలకొన్న అస్పష్టతను తెలియజేస్తోంది.

హర్మూజ్ అడ్డంకులు చెరిపేసి

## భారత్‌కు చేరిన ఎల్పీజీ నౌకలు

● గుజరాత్ పోర్టులకు చేరిన 'శివాలిక్', 'నందాదేవి' నౌకలు
● రాష్ట్రాలకు గ్యాస్ సరఫరా ప్రారంభం - ఉపశమనం పొందనున్న ప్రజలు ● త్వరలో తమిళనాడుకు నౌకలు - సరఫరా వేగవంతం చేయాలని కేంద్రం నిర్ణయం



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : దేశవ్యాప్తంగా ఏర్పడిన ఎల్పీజీ కొరతపై కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా హర్మూజ్ జలసంధి వద్ద నిలిచిపోయిన భారత్‌కు చెందిన రెండు భారీ ఎల్పీజీ నౌకలు సురక్షితంగా దేశానికి చేరుకోవడంతో గ్యాస్ సరఫరా సమస్యకు త్వరలో పూర్తి పరిష్కారం లభించనుంది.'శివాలిక్' అనే నౌక 46,500 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ సోమవారం సాయంత్రం గుజరాత్‌లోని ముంద్ర పోర్టుకు చేరుకోగా, 'నందాదేవి' అనే మరో నౌక మంగళవారం జామ్‌నగర్‌లోని వాడినార్ పోర్టుకు చేరుకుంది. ఈ రెండు నౌకలు సకాలంలో చేరుకోవడంతో దేశంలో గ్యాస్ సరఫరా వ్యవస్థకు ఊపిరి పీల్చుకునే అవకాశం లభించింది.భారత షిప్పింగ్ మంత్రిత్వ శాఖ, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సమన్వయంతో ఈ నౌకలు సురక్షితంగా ప్రయాణం పూర్తి చేశాయి. హర్మూజ్ జలసంధి దాటడంలో భారత, ఇరాన్ నౌకాదళాలు కీలక సహకారం అందించినట్లు అధికారులు తెలిపారు.ప్రస్తుతం ఈ నౌకల్లోని ఎల్పీజీ ఇతర రవాణా నౌకల్లోకి బదిలీ చేసే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తైన వెంటనే, గ్యాస్ సరఫరాను మరింత వేగవంతం చేయడానికి ఈ నౌకలను నేరుగా తమిళనాడుకు తరలించనున్నట్లు వెల్లడించారు.ఇతర మార్గాల ద్వారా సరఫరా చేయడం కంటే ఈ విధానం ద్వారా సమయం ఆదా అవుతుందని, రాష్ట్రాలకు త్వరితగతిన గ్యాస్ అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఉన్న ఇతర భారత జెండా నౌకలు కూడా క్రమంగా దేశానికి చేరుకునే అవకాశముందని సమాచారం.ఈ పరిణామంతో దేశవ్యాప్తంగా గ్యాస్ కొరత తగ్గిపోనుండగా, వినియోగదారులకు త్వరలో సాధారణ సరఫరా పునరుద్ధరించబడనుంది.

# పెట్రోల్, డీజిల్ ధరలు పెంచం

● సోషల్ మీడియాలో ప్రచారం అంతా అబద్ధం ● ప్రకటన చేసిన కేంద్రం



న్యూఢిల్లీ : పశ్చిమ ఆసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ చమురు మార్కెట్లు తీవ్ర అస్థిరతను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాలతో ఎప్పుడు ఎలాంటి పిడుగు తమపై పడుతుందో అనే ఆందోళన భారత్?లోని వాహనదారులను టెన్షన్ పెట్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ప్రణాళిక లేదని పెట్రోలియం మంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటించింది. అంతర్–మంత్రిత్వ శాఖల సమావేశంలో పెట్రోలియం మరియు సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ప్రణాళికలు కేంద్ర ప్రభుత్వానికి లేదని క్లారిటీ ఇచ్చారు. అలాగే భారత్?లో పెట్రోల్, డీజిల్ విషయంలో రకరకాల వదంతులు సోషల్ మీడియాలో వ్యాపిస్తున్నాయి. దీంతో అనేక మంది తమకు అవసరం లేకపోయినా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ కోసం పరుగులు పెడుతున్నారు. దీంతో ఎవరూ ఇంధనం విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. సరిపడ నిల్వలు దేశంలో ఉన్నాయన్నారు. వాణిజ్య ఎల్?పీజీ వినియోగదారులు పీఎన్‌జీ (పైప్డ్ నేచురల్ గ్యాస్)కి మారితే అది మరింత ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు.

**బ్లాక్ మార్కెట్ పై ఉక్కుపాదం**

గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్త తనిఖీలను ముమ్మరం చేసిందని గత కొద్ది రోజులుగా జరిపిన దాడుల్లో భారీగా అక్రమ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు సుజాత శర్మ తెలిపారు. ఇటీవల దేశవ్యాప్తంగా 12,000 దాడులు నిర్వహించి,15,000 సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ప్రభుత్వ అధికారులతో పాటు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ఇన్‌స్పెక్షన్ టీమ్స్ కూడా రంగంలోకి దిగాయని సుమారు 2,500 రిటైల్ అవుట్‌లెట్లు మరియు ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ పాయింట్ల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు.ఈ విషయంపై కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖకు చెందిన రాజేష్ కుమార్ సిన్హా మాట్లాడుతూ రెండవ ఎల్పీజీ క్యారియర్ 'నందా దేవి' ఇవాళ తెల్లవారుజామున సుమారు 2:30 గంటలకు కాండ్లా పోర్టుకు చేరుకుందని తెలిపారు. ప్రస్తుతం 'శివాలిక్', 'నందా దేవి' ఎల్పీజీ నౌకల నుంచి డిశ్చార్జ్ జరుగుతోందన్నారు. 'నందా దేవి' నౌకలో కార్గో డిశ్చార్జ్ 'షిప్–టు–షిప్' విధానంలో జరుగుతోందని అంటే మదర్ షిప్ నుంచి డాటర్ షిప్‌కు మారుస్తున్నారని వెల్లడించారు. ఈ ఉదయం జవహర్లాల్ నెహ్రూ పోర్టులో సుమారు 450 కంటైనర్లు రోడ్డుపై పడి ఉన్నాయనే వార్తలను ఆయన ఖండించారు.

## ఏపిఇడిప చర్యలు, ఏఫ్‌పిఓల మద్దతుపై కేంద్రాన్ని నిలదీసిన చిత్తూరు ఎంపీ

● రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు మార్కెట్ లింకేజీలపై లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ దగ్గుమళ్ల ● లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ● ఎగుమతుల ప్రోత్సాహానికి విస్తృత చర్యలు చేపట్టినట్లు కేంద్ర వివరణ



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓలు) మార్కెట్ లింకేజీల బలోపేతంపై చిత్తూరు పార్లమెంటు సభ్యుడు దగ్గుమళ్ల ప్రసాదరావు లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో మార్కెట్ లింకేజీ మోడళ్ల పెంపు, గత ఐదేళ్లలో ఎపిఇడిఎ మద్దతు పొందిన ఎఫ్‌పిఓల సంఖ్య, చేపట్టిన ప్రమోషనల్ కార్యక్రమాల వివరాలను తెలియ[illegible] ప్రశ్నలకు స్పందించిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఎగుమతుల అభివృద్ధికి కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్ర హక్కులు, ప్రయోజనాల కోసం తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు.కేంద్ర సమాధానం ప్రకారం, అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎపిఇడిఎ) రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ఎగుమతి సౌకర్యాలు, కొనుగోలుదారులు–విక్రేతల సమావేశాలు, సామర్థ్య నిర్మాణం, బ్రాండింగ్ మద్దతు వంటి చర్యలను చేపట్టింది. అంతర్జాతీయ కొనుగోలుదారులు, ఈ-[illegible]కామర్స్ వేదికలు, రవాణా సంస్థ[illegible] భాగస్వామ్యాలు కుదుర్చు[illegible] మార్కెట్ అవకాశాలను విస్తరించింది. 2021–22లో ఎపిఇడిఎ ద్వారా 24.77 బిలియన్ డాలర్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి కాగా, 2022–23లో లక్ష్యం 23.56 బిలియన్ డాలర్లుగా నిర్దేశించబడింది. కార్యక్రమాల సంఖ్య 2023–24లో 139 నుంచి 2025–26 నాటికి 764కి పెరగడం గమనార్హం.అంతర్జాతీయ ప్రమాణాల సాధనలో భాగంగా 7 ఎఫ్‌పిఓలకు గ్లోబల్ జీఏపీ సర్టిఫికేషన్ కోసం ఆర్థిక సహాయం అందించగా, కొత్త మార్కెట్లకు ఎగుమతులను సులభతరం చేసింది. 2024–25లో 7 రాష్ట్రాల నుంచి 7 దేశాలకు 9 ఎగుమతి కార్యక్రమాలు, 2025–26లో 4 దేశాలకు 7 ఎగుమతి కార్యక్రమాలు నిర్వహించినట్లు కేంద్రం వెల్లడించింది.అదనంగా గల్ఫ్ దేశాల్లో మార్కెట్ అవకాశాల [illegible] ఒప్పందాలు కుదుర్చుకోవడం, ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ వేదిక ద్వారా ఎఫ్‌పిఓలను అనుసంధానం చేయడం వంటి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో గత నాలుగేళ్లలో 37 ఎఫ్‌పిఓలు ఎపిఇడిఎతో అనుసంధానమయ్యాయి. రాష్ట్రంలోని 25 జిల్లాల్లో 31 సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు నిర్వహించగా, నాలుగు జిల్లాల్లో కొనుగోలుదారులు–విక్రేతల సమావేశాలు నిర్వహించడం ద్వారా రైతులకు మార్కెట్ అవకాశాలు పెంచినట్లు కేంద్రం వివరించింది.ఈ చర్యలతో రైతు ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో విస్తృత అవకాశాలు కలుగుతున్నాయని అధికారులు తెలిపారు.

## ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ రైట్ హ్యాండ్ హతం

● గల్ఫ్ సహా పలు దేశాలలో అంతర్జాతీయ ప్రయాణాలు, భద్రతకు తీవ్ర అంతరాయాలు ● అనేక దేశాల్లో చిక్కుకుపోయిన వేలాది మంది ప్రయాణికులు



న్యూఢిల్లీః ఇరాన్‌పై దాడుల అనంతరం కీలక పరిణామాలు చోటు చేసుకుంటోన్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్ వరకే ఇది పరిమితం కాలేదు. గల్ఫ్ దేశాలకూ పాకింది. యుద్ధం 18వ రోజుకు చేరుకోగా దీనికి ముగింపు కనపించట్లేదు. గల్ఫ్ ప్రాంతంలో ఇంధన సరఫరాలు, అంతర్జాతీయ ప్రయాణాలు, భద్రతకు తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఇది అనేక దేశాల్లో వేలాది మంది ప్రయాణికులను చిక్కుకుపోయేలా చేస్తోంది.ఈ యుద్ధంలో ఇప్పటివరకు 2,000 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువ మంది ఇరాన్‌లోనే కాగా, లెబనాన్, గల్ఫ్ దేశాల్లో కూడా మరణాలు నమోదయ్యాయి. దశాబ్దాల తర్వాత తొలిసారిగా గల్ఫ్ ప్రాంతం యుద్ధ ముఖద్వారంలో నిలిచింది. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు.ఈ పరిణామాల మధ్య ఇరాన్ కు భారీ నష్టం సంభవించింది. తాజాగా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లారిజానీ, బసిజ్ యూనిట్ కమాండర్ ఘోలమ్రెజా సోలెమానీని మరణించారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ అధికారికంగా ప్రకటించింది. తాజా దాడుల్లో లారిజానీ, సోలెమానీ మరణించినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ ప్రకటించింది. రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ వెంటనే ఈ మరణాన్ని ధృవీకరించినట్లు ది జెరూసలేం పోస్ట్ వెల్లడించింది.లారిజానీ మంగళవారం ప్రసంగించాల్సి ఉందని ఇరాన్ అధికారులు ప్రకటించగా ఐడీఎఫ్ మాత్రం తాజా దాడుల్లో ఆయన చనిపోయాడని పేర్కొంది. లారిజానీ మరణం ఖరారయ్యాక మొస్సాద్ ట్వీట్ చేసింది. "చివరికి దయ లేనివారు చనిపోతారు" అని తెలిపింది. ఆ కొద్దిసేపటికే ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ బసిజ్ మిలీషియా అధిపతి ఘోలమ్రెజా సోలేమానీ, అతని డిప్యూటీ సయ్యద్ కరీషీలు కూడా మరణించినట్లు వెల్లడించింది.

# కాల్పుల విరమణకు మోజ్తాబా ససేమిరా

● మధ్యవర్తిత్వ ప్రతిపాదనలు చేసిన రెండు దేశాలు ● అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తప్పదని హెచ్చరిక



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేలా కాల్పుల విరమణకు సంబంధించి రెండు మధ్యవర్తిత్వ దేశాలు చేసిన ప్రతిపాదనలను తమ సుప్రీం లీడర్ మోజ్తాబా ఖమేనీ తిరస్కరించారని ఓ ఇరాన్ సీనియర్ అధికారి వ్యాఖ్యలను ఉటంకిస్తూ రాయిటర్స్ కథనం వెలువరించింది. సుప్రీం లీడర్‌గా ఎన్నికైన తర్వాత విదేశాంగ విధానంపై నిర్వహించిన తన తొలి సమావేశంలో.. అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకోవాలన్న కఠిన వైఖరిని ఖమేనీ వ్యక్తం చేశారని ఆ అధికారి పేర్కొన్నట్టు తెలిపింది. అయితే, ఆ సమావేశాలకు ఖమేనీ స్వయంగా హాజరయ్యారా? లేదా? అనేది మాత్రం ఆయన స్పష్టం చేయలేదని పేర్కొంది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు, ఆస్తులను ఇరాన్ లక్ష్యంగా చేసుకుని, డ్రోన్, క్షిపణులతో దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే.సుప్రీం లీడర్‌గా ఎన్నికైన తర్వాత గతవారం తొలి ప్రకటన విడుదల చేసిన మోజ్తాబా ఖమేనీ .. యుద్ధంలో ప్రతి ఒక్కరి మరణానికి ఇరాన్ బదులు తీర్చుకుంటుందని, శత్రువు నుంచి పరిహారం వసూలు చేస్తుందని శపథం చేశారు. అందుకు వాళ్లు నిరాకరిస్తే వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడం లేదా ధ్వంసం చేయడం జరుగుతుందని ఆయన తేల్చిచెప్పారు. "ఈ ప్రతీకారంలో కొంత భాగం ఇప్పటివరకు ఒక నిర్దిష్ట రూపాన్ని సంతరించుకుంది... కానీ అది పూర్తిగా నెరవేరే వరకు, ఇది మా ప్రాధాన్యతలలో ఒకటిగానే ఉంటుంది" అని స్పష్టం చేశారు.

ఇరాన్ ఎప్పటికీ వెనుకంజ వేయదని, పూర్తి బలంతో ప్రతిఘటిస్తుందని, కేవలం అయతుల్లా అలీ ఖమేనీకి మాత్రమే కాకుండా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి పౌరుడి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటుందని ఆయన అన్నారు. "అమరుల రక్తానికి సంబంధించిన ప్రతీకారాన్ని మేము మర్చిపోం" అని ఆయన పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, ఫిబ్రవరి 28న జరిగిన వైమానిక దాడుల్లో తీవ్రంగా గాయపడిన మోజ్తాబా ఖమేనీ.. ప్రస్తుతం రష్యాలో చికిత్స పొందుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

వ్లాదిమిర్ పుతిన్ చికిత్స కోసం మోజ్తాబాను మాస్కోకు తరలించాలని ఇరాన్ ప్రెసిడెంట్ మసూద్ పెజెష్కియాన్‌కు ఫోన్ చేసి చెప్పినట్టు కువైట్ పత్రిక అల్–జరీదా నివేదించింది. పుతిన్ కాల్ తర్వాత గురువారం ఆయనను రష్యా సైనిక విమానంలో మాస్కోకు తరలించినట్టు పేర్కొంది.

అయితే, ఈ నివేదికలను రష్యా తిరస్కరించనూ లేదా ఖండించనూ లేదు.

ఇటువంటి వాటిపై మేము మాట్లాడబోమని రష్యా అధ్యక్షుడు ప్రెస్ సెక్రెటరీ దిమిత్రీ పెస్కోవ్ వ్యాఖ్యానించారు. ఇక, తమ సైన్యం దాడిలో ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ హతమైనట్టు ఇజ్రాయెల్ ప్రకటన చేసింది. అయితే, దీనిపై ఇరాన్ నుంచి ఇంకా ఎటువంటి స్పందన రాలేదు.

## కాబూల్ ఆసుపత్రిపై పాక్ దాడి అమానుషం..

● పాక్ దుశ్చర్యను ఖండించిన భారత్
● ఘటనలో 400 పైగా పౌరుల మరణం



న్యూఢిల్లీ: అఫ్గానిస్థాన్ లోని కాబూల్ ఆసుపత్రిపై మార్చి 16వ తేదీ రాత్రి పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిలో మృతుల సంఖ్య 400కు చేరింది. ఇది అత్యంత అమానుష ఘటన అంటూ పాక్ దుశ్చర్యను భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపంద చర్య అని మండిపడింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ మంగళవారంనాడు ఒక ప్రకటన విడుదల చేసింది.'పాకిస్థాన్ జరిపిన వాయుదాడిని భారత్ నిర్ద్వంద్వంగా ఖండిస్తోంది. ఇది పిరికిపంద చర్య. దుర్మార్గమైన హింసాత్మక చర్య. పెద్ద సంఖ్యలో పౌరులు మరణించారు. ఈ మారణహోమాన్ని సైనిక ఆపరేషన్‌గా కప్పిపుచ్చుకునేందుకు పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. ఇది అఫ్గాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి. ఇలాంటి చర్యల వల్ల ప్రాంతీయ అస్థిరతకు ముప్పు వాటిల్లుతుంది. దేశ అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సరిహద్దుకు ఆవల దాడులకు దిగడం పాకిస్థాన్ బాధ్యతారాహిత్యాన్ని, నిర్లక్ష్యాన్ని చాటుతుంది' అని విదేశాంగ శాఖ తెలిపారు.పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడులకు పాల్పడటం మరింత దారుణమని, నమ్మకాలు, చట్టాలు, నైతికత లేకుండా ఆసుపత్రులు, పేషెంట్లపై దాడి చేశారని విమర్శించింది. ఇలాంటి దాడులకు పాల్పడేవారిని అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలని భారత్ సూచించింది. మృతులు, వారి కుటుంబాలకు తీవ్ర సంతాపం తెలియజేస్తున్నామని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నామని పేర్కొంది. ఈ విషాద సమయంలో అఫ్గాన్ ప్రజలకు సంఘీభావం తెలియజేస్తున్నామని, అఫ్గాన్ సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రతకు భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని విదేశాంగ శాఖ ప్రకటించింది.

చర్చలు, దౌత్యమే మార్గం

# పశ్చిమాసియా సంక్షోభం ముగింపునకు భారత్ భాసట

● ఈయూ మంత్రుల సమావేశంలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్
● దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎక్కడా కొరత లేదని కేంద్ర స్పష్టం

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం ముగింపునకు చర్చలు, దౌత్య మార్గాల అవశ్యకతను భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రస్తావించారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్ధీర్ జైస్వాల్ చెప్పారు. యూరోపియన్ యూనియన్ నేతల ఆహ్వానం మేరకు బ్రస్సెల్లో పర్యటించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. "మా విదేశాంగ మంత్రి జై శంకర్ బ్రస్సెల్స్ పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలోనే ఈయూ విదేశాంగ వ్యవహారాల కౌన్సిల్ సమావేశంలో పాల్గొనాల్సిందిగా ఈయూ ఉన్నత ప్రతినిధి, ఉపాధ్యక్షురాలు కాజా కల్లాస్ ఆయనను ఆహ్వానించారు. ఈ సమావేశంలో భారత్–ఈయూ సంబంధాలపై చర్చించడంతో పాటు ప్రపంచ సవాళ్లపై ముఖ్యంగా పశ్చిమాసియాలోని పరిస్థితిపై, ఇంధన భద్రతపై దాని ప్రభావాలతో సహా చర్చించారు. ఇందులో జైశంకర్తో పాటు యూరోపియన్ యూనియన్‌లోని ఇతర మంత్రులు, ఈయూలోని వివిధ దేశాల విదేశాంగ మంత్రులు హాజరయ్యారు. ఈ క్రమంలోనే సంక్షోభాన్ని త్వరగా ముగింపు పలకడానికి చర్చలు, దౌత్య మార్గాలను అనుసరించాల్సిన అవసరాన్ని మంత్రులు చర్చించారు." అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు.అటు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ రెండు రోజుల పర్యటనలో భాగంగా బ్రస్సెల్స్‌లో పర్యటించారు. బ్రస్సెల్స్‌లో పర్యటనను విజయవంతంగా ముగించానంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. "యూరోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల మండలి సమావేశం, ఈయూ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌లతో భేటీ, ఈయూ ఉపాధ్యక్షురాలు కాజా కల్లాస్‌తో చర్చలు జరిగాయి. ఈయూ ప్రతినిధులను కూడా కలుసుకుని పలువురితో విడివిడిగా ద్వైపాక్షిక చర్చలు జరిపాము." అని పోస్ట్ చేశారు. ఈ క్రమంలోనే ఈయూ– భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద సహా పది కీలక అంశాలపై చర్చించినట్లు జైశంకర్ తెలిపారు.

**'ఇంధన కొరతపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు'**

దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎక్కడా కొరత లేదని కేంద్ర పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌లో ఇంధన కొరత ఏర్పడవచ్చనే వార్తల నేపథ్యంలో ఈ మేరకు స్పష్టతనిచ్చారు. ఇంధన కొరతపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, పెట్రోల్ బంకుల వద్దకు వెళ్లి అధికంగా కొనుగోలు చేయడం వంటివి చేయవద్దని ఆమె కోరారు. సహజ వాయువు సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని సుజాత శర్మ తెలిపారు. వాణిజ్యపరమైన ఎల్పిజి సిలిండర్లను వాడుతున్న వినియోగదారులు పిఎన్‌జి కనెక్షన్‌లకు మారడం శ్రేయస్కరమని, దీనివల్ల నిరంతరాయంగా గ్యాస్ సరఫరా పొందవచ్చని సూచించారు.

గృహ వినియోగదారులకు ఎల్పిజి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, గత కొద్ది రోజులుగా దేశీయ గ్యాస్ ఉత్పత్తిని కూడా పెంచామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు అక్రమంగా నిల్వ ఉంచిన దాదాపు 15వేల సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు."గ్యాస్ సిలిండర్లకు సంబంధించి గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా సుమారు 12,000 దాడులు జరిగాయి. దాదాపు 15,000 సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిన్న దిల్లీలో సుమారు 600 సిలిండర్లను సీజ్ చేశారు. గత కొన్ని రోజుల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో దాదాపు 450 తనిఖీలు జరిగాయి. ఇందులో 10 మందిని అరెస్టు చేశారు. జమ్మూకశ్మీర్‌లో 564 దాడులు నిర్వహించి, పలువురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో పాటు అరెస్టు చేశారు. కేరళలో సుమారు 1,000 దాడులు నిర్వహించి, గృహ, వాణిజ్య అవసరాలకు వాడుతున్న అక్రమ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు." అని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు.





# కలర్స్

LIFE IS A RAINBOW

# అస్సాం పీఠంపై 'హ్యాట్రిక్' గురి..



మళ్లీ గెలుపు కోసం బిజేపీ కూటమి ప్రయత్నాలు

కమలాన్ని నిలువరించే యత్నంలో కాంగ్రెస్

క్రమక్రమంగా రాజకీయ ముఖచిత్రం మారుతుందని అంచనా

**ఏప్రిల్ 9న అస్సాం ఎన్నికలు: కాంగ్రెస్ వ్యతిరేకత నేపథ్యంలో ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అస్సాంలో వరుసగా రెండోసారి అధికారాన్ని నిలబెట్టుకుంటుందా, లేక కాంగ్రెస్ నేతృత్వంలోని విచ్ఛిన్నమైన ప్రతిపక్షం గట్టి సవాలు విసురుతుందా? ఏప్రిల్ 9న తదుపరి ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఓటింగ్ జరగనున్నప్పుడు ఈ ప్రశ్నకు సమాధానం లభిస్తుంది. మరిన్ని వివరాలలోకి వెళితే ....**

అస్సాంలోనూ రాజకీయ పోరు రసవత్తరంగా కనిపిస్తోంది. హ్యాట్రిక్ కొట్టి.. మూడోసారి అధికారం చేజిక్కించుకోవాలని బీజేపీ తహతహలాడుతోంది. అయితే.. గత ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నాయో ఓసారి పరిశీలిస్తే.. 2016 ఎన్నికల్లో బీజేపీ 60 స్థానాల్లో గెలిచింది. 2021 ఎన్నికల్లో మళ్లీ 60 స్థానాల్లో గెలిచింది. రెండుసార్లూ.. మ్యాజిక్ ఫిగర్ దాటకపోయినా, బీజేపీనే అధికారం దక్కించుకుంది. ఇక.. కాంగ్రెస్ 2016లో 13 స్థానాలు గెలిస్తే, గత ఎన్నికల్లో 16 స్థానాలు గెలిచింది. ఆలిండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ 2016లో 13 సీట్లు గెలిస్తే.. గత ఎన్నికల్లో 16 స్థానాలు సాధించింది. అసోం గానా పరిషత్ 2016లో 14 సీట్లు గెలిస్తే.. 2021లో 9 సీట్లకే పరిమితమైంది. ఈసారి కూడా బీజేపీ అధికారం నిలబెట్టుకుంటుందా? 60 కంటే ఎక్కువ స్థానాలు గెలుస్తుందా.. మళ్లీ 60 దగ్గరే ఆగుతుందా? అంతకంటే తక్కువ సాధిస్తుందా? అనేది ఇంట్రస్టింగ్‌గా మారింది.

ఏప్రిల్ 9న ఒకే విడతలో జరగనున్న 2026 అస్సాం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ఆదివారం ప్రకటించింది. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. 126 మంది సభ్యులున్న అస్సాం శాసనసభకు జరిగే పోటీ, బీజేపీ నేతృత్వంలోని కూటమి మరియు ఇంకా మద్దతు కూడగట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమి మధ్యే కేంద్రీకృతమై ఉంటుందని అంచనా.

## 2026లో కీలక ఓటర్ల సమస్యలు



**వలసలు మరియు గుర్తింపు రాజకీయాలు:** బంగ్లాదేశ్ నుండి అక్రమ వలసలు అస్సాంలో చాలా కాలంగా అత్యంత వివాదాస్పద సమస్యలలో ఒకటిగా ఉన్నాయి. పౌరసత్వ సవరణ చట్టం అమలు మరియు జాతీయ పౌర పట్టిక చుట్టూ ఉన్న చర్చలు రాజకీయంగా సున్నితమైన అంశాలుగా మిగిలి ఉన్నాయి.

**జాతి మరియు ప్రాంతీయ స్వయంప్రతిపత్తి:** గిరిజన సమూహాలు మరియు స్వయంప్రతిపత్తి మండళ్ల నుండి, ముఖ్యంగా బోడోలాండ్ మరియు కొండ జిల్లాల నుండి వస్తున్న డిమాండ్లు ఎన్నికల రాజకీయాలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి.

**ఉద్యోగ కల్పన మరియు ఆర్థిక అభివృద్ధి:** యువత నిరుద్యోగం మరియు ఆర్థిక అవకాశాలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో, ప్రధాన ఆందోళనలుగా మిగిలి ఉన్నాయి.

**వరద నిర్వహణ:** బ్రహ్మపుత్ర నది వల్ల పదేపదే సంభవించే వరదలు ప్రతి ఏటా లక్షలాది మందిని ప్రభావితం చేస్తూనే ఉన్నాయి మరియు

### హిమంత బిస్వా శర్మ నేతృత్వంలో

ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అస్సాంలో వరుసగా రెండోసారి అధికారాన్ని నిలబెట్టుకుంటుందా, ూలేక కాంగ్రెస్ నేతృత్వంలోని విచ్ఛిన్నమైన ప్రతిపక్షం గట్టి సవాలు విసురుతుందా? ఏప్రిల్ 9న రాష్ట్రం తన తదుపరి ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఓటింగ్ జరగనున్నప్పుడు ఈ ప్రశ్నకు సమాధానం లభిస్తుంది. . 126 మంది సభ్యులున్న అస్సాం శాసనసభకు జరిగే పోటీ, బీజేపీ నేతృత్వంలోని కూటమి మరియు ఇంకా మద్దతు కూడగట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమి మధ్యే కేంద్రీకృతమై ఉంటుందని అంచనా.

### బీజేపీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి:

అస్సాంలో అధికార కూటమికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకత్వం వహిస్తుండగా, ఇందులో అసోం గణ పరిషత్, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ వంటి ప్రాంతీయ మిత్రపక్షాలు ఉన్నాయి. 2021లో అధికారం చేపట్టిన శర్మ, రాష్ట్రంలో బీజేపీ తరఫున అత్యంత ప్రముఖ నాయకుడిగా కొనసాగుతున్నారు. ఆయన ప్రభుత్వం మౌలిక సదుపాయాలు, శాంతిభద్రతల చర్యలు, సంక్షేమ పథకాలపై దృష్టి సారించడంతో పాటు, అక్రమ వలసలు, గుర్తింపు రాజకీయాలు వంటి అంశాలపై కూడా బలమైన రాజకీయ వైఖరిని తీసుకుంది.

### అస్సాంలో బీజేపీ బలమేనా?

అస్సాంలో.. బీజేపీకి స్ట్రాంగ్ క్యాడర్ ఉంది. కూటమిలోని పార్టీలతో.. బలమైన భాగస్వామ్యం ఉంది. స్థానికంగానూ, ఆదివాసీల్లోనూ బీజేపీకి మంచి ఆదరణ కనిపిస్తోంది. మోడీ, హిమంత నాయకత్వంలో.. అభివృద్ధి, పాలన సమపాళ్లలో సాగుతున్నాయనే ప్రచారం ఉంది. ముఖ్యంగా.. సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, ఆక్రమణలకు వ్యతిరేకంగా.. హిమంత బిశ్వ శర్మ పాలన కొనసాగుతోంది. ఇదే సమయంలో.. పదేళ్ల పాలనపై ఉన్న ప్రజా వ్యతిరేకత కొంతమేర నష్టం చేసే అవకాశాలున్నాయి. జాతి, సాంస్కృతిక ఉద్యమాలు పెరగడంతో.. కొన్ని సున్నితమైన నియోజకవర్గాల్లో.. బీజేపీ పట్టు కోల్పోతుందనే వాదనలు వినిపిస్తున్నాయ్.

### కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమి:

వరుస ఎన్నికల పరాజయాల తర్వాత తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందడానికి ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీయే ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. బద్రుద్దీన్ అజ్మల్ నేతృత్వంలోని ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ వంటి ప్రాంతీయ పార్టీలతో పాటు, కొత్తగా పుట్టుకొచ్చిన ప్రాంతీయ శక్తులతో కూడా కాంగ్రెస్ మళ్లీ పొత్తుల కోసం ప్రయత్నించవచ్చు. అయితే, అస్సాంలో ప్రతిపక్ష ఐక్యత చారిత్రాత్మకంగా బలహీనంగా ఉంది, మరియు సీట్ల పంపకంపై చర్చలు వివాదాస్పదంగా మారే అవకాశం ఉంది.

### ప్రాంతీయ మరియు వర్ధమాన పార్టీలు

హోదాను హత్తుకునే పోటీలలో అనేక ప్రాంతీయ పార్టీలు ఫలితాన్ని ప్రభావితం చేయగలవు. కార్యకర్త నుండి రాజకీయ నాయకుడిగా మారిన అఖిల్ గోగోయ్ నేతృత్వంలోని రైజోర్ దళ్, పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేంక నిరసనల తర్వాత ఏర్పడిన అస్సాం జాతీయ పరిషత్ వంటివి వీటిలో ఉన్నాయి. ఈ పార్టీలు ప్రాంతీయ గుర్తింపును ఆసరాగా చేసుకుని, కీలక నియోజకవర్గాలలో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చగలవు.



### సునాయాసంగా కూటమి

2021 అస్సాంశాసనసభ ఎన్నికలలో, బీజేపీనేతృత్వంలోని కూటమి సునాయాసంగా అధికారాన్ని నిలబెట్టుకుంది. ఆ పార్టీ 60 సీట్లు గెలుచుకోగా, అసోం గణ పరిషత్ తొమ్మిది సీట్లు దక్కించుకుంది. మరోవైపు, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ ఆరు సీట్లు గెలుచుకుంది. ఈ కూటమి మొత్తం మెజారిటీ మార్కును దాటింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షం సుమారు 50 సీట్లు గెలుచుకోగా, చిన్న ప్రాంతీయ పార్టీలు కొన్ని సీట్లను దక్కించుకున్నాయి. ఈ ఎన్నికల్లో 80 శాతానికి పైగా ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. ఇది రాష్ట్రంలోని ఓటర్లు రాజకీయంగా ఎంత చురుకుగా ఉన్నారో ప్రతిబింబిస్తుంది.

### ఎన్నికలకు ముందు రాజకీయ ఎత్తుగడలు

బీజేపీ అస్సాం అంతటా తన సంస్థాగత బలాన్ని పటిష్టం చేసుకుంటూ, గతంలో కాంగ్రెస్ ఆధిపత్యంలో ఉన్న నియోజకవర్గాల్లోకి విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. మరోవైపు, కాంగ్రెస్ తన క్షేత్రస్థాయి నెట్‌వర్క్‌ను పునర్నిర్మించుకోవడానికి మరియు మైనారిటీ, బీజేపీ వ్యతిరేక ఓట్లను ఏకీకృతం చేయగల పొత్తులను పునరుద్ధరించుకోవడానికి ప్రయత్నిస్తోంది. సీఏఏ వ్యతిరేక ఉద్యమం నుండి పుట్టిన ప్రాంతీయ పార్టీలు, హోరాహోరీగా సాగే స్థానాల్లో ప్రతిపక్ష ఓట్లు చీలిపోతే, ఫలితాలను దెబ్బతీసే పాత్ర పోషించవచ్చు.

### అస్సాంలో కొత్త సమీకరణాలు

అయితే.. మహిళలు, విద్యార్థుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయడం లాంటివి కొంత మేర ప్రయోజనం చేకూర్చే ఛాన్స్ ఉంది. సీఎం హిమంత.. అస్సాంలో ఎన్డీయే కూటమిని.. అస్సాం గుర్తింపుని కాపాడే రక్షణ కవచంగా నిలబెట్టడంలో సక్సెస్ అయ్యారు. చొరబాట్లను అడ్డుకునేందుకు ఎంతో కృషి చేశారనే చర్చ కూడా పాజిటివ్‌గా కనిపిస్తోంది. అయితే.. అస్సాంలో కాంగ్రెస్ ఎలా వ్యవహరించబోతోంది? ఎలాంటి పాచికలను పారిస్తుందనే దానిమీదే.. బీజేపీ భవితవ్యం ఆధారపడి ఉంది. కూటమిలో సీట్ల పంపకాల్లో ఎలాంటి విభేదాలు తలెత్తుతాయనేది కూడా చర్చకు వస్తోంది. ఈ విషయంలో తేడాలొస్తే.. భాగస్వామ్య పార్టీలు ఎన్డీయేకు నష్టం చేసేలా వ్యవహరించే ఛాన్స్ ఉందంటున్నారు.

### హ్యాట్రిక్ అడ్డుకుంటుందా కాంగ్రెస్?

కాంగ్రెస్ విషయానికొస్తే.. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అస్సాంలో చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లు అడిగే అవకాశం ఉంది. బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలనే.. ప్రచారాస్త్రాలుగా మలచుకోనున్నారు. మైనార్టీలు,



టీ గార్డెన్ వర్కర్ల మద్దతు కూడగట్టేందుకు.. కాంగ్రెస్ ట్రై చేస్తోంది. ఏజేపీ, లెఫ్ట్ పార్టీలతో పొత్తు పెట్టుకోవాలనే ప్రతిపాదనలు వస్తున్నాయి. కానీ, ఇది కుదురుతుందా? లేదా? అనేది డౌటే. పదేళ్ల బీజేపీ పాలనపై ఉన్న ప్రజా వ్యతిరేకతే.. కాంగ్రెస్‌కు తిరుగులేని అస్త్రంగా కనిపిస్తోంది. చొరబాట్ల అంశం కూడా కాంగ్రెస్‌కు మేలు చేస్తుందనే చర్చ జరుగుతోంది. ఆలిండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ కూడా అస్సాంలో కీలకంగా కనిపిస్తోంది. లోయర్ అస్సాంలో.. ముస్లిం మైనార్టీలకు శాశ్వత బేస్ కల్పించేందుకు పోరాడింది. అయితే, కమ్యూనిటీ ఓన్లీ అనే ఇమేజ్.. ఏఐయూడీఎఫ్ విస్తరణకు బ్రేకులు వేస్తోంది. అయినప్పటికీ.. అస్సాంలో హంగ్ గనక వస్తే.. ఈ పార్టీనే కింగ్ మేకర్‌గా అవతరించే అవకాశాలున్నాయి. మైనార్టీలను తమ వైపు తిప్పుకోవడంలో కాంగ్రెస్ విఫలమైతే.. ఆ ఓట్లన్నీ ఏఐయూడీఎఫ్‌కు టర్న్ అయ్యే ఛాన్స్ ఉంది. ఇలాంటి రాజకీయ పరిస్థితుల్లో.. అస్సాంలో బీజేపీ హ్యాట్రిక్ కొడుతుందా? లేదా? అనేది ఆసక్తి రేపుతోంది. మరి.. అస్సాం ప్రజల తీర్పు, ఆలోచన ఎలా ఉన్నాయో.. మే 4న తేలిపోతుంది

ఈశాన్య రాష్ట్రం కావడంతో సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. రాష్ట్రంలో ప్రస్తుతం హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. మరోసారి అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ ఇక్కడ ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు విపక్ష కాంగ్రెస్ పార్టీ కూడా అధికారం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. ఇప్పటివరకూ వెలువడిన సర్వే అంచనాల ప్రకారం ఇక్కడ బీజేపీకి మొగ్గు కనిపిస్తోంది.

**బి.వి.రమణ – 94407 40015**

## అస్సాం ఎన్నికల షెడ్యూల్




ఈశాన్య రాష్ట్రమైన అస్సాం లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. కొద్దిసేపటి క్రితం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ ( జ్ఞానేష్ కుమార్ దీన్ని విడుదల చేశారు. దీని ప్రకారం ఏప్రిల్ 9న అస్సోం అసెంబ్లీకి ఎన్నికలు జరగబోతున్నాయి. అలాగే మే 4న ఓట్ల లెక్కింపు చేసి ఫలితాలు విడుదల చేస్తామని సీఈసీ ప్రకటించారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ వెంటనే అమల్లోకి వచ్చేసింది. 126 అసెంబ్లీ స్థానాలున్న అస్సాంలో ఈసారి ఎన్నికల ప్రక్రియ మార్చి 16 నుంచి ప్రారంభం కాబోతోంది. మార్చి 16న పోటీ చేస్తున్న అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. ఈ నెల 23 వరకూ నామినేషన్ల స్వీకరణ ఉంటుంది.. అనంతరం మార్చి 24న నామినేషన్ల పరిశీలన చేస్తారు. తర్వాత మార్చి 26న నామినేషన్ల ఉపసంహరణకు అభ్యర్థులకు గడువు ఇచ్చారు. ఏప్రిల్ 9న రాష్ట్రంలో పోలింగ్ నిర్వహిస్తారు. మే 4 ఫలితాల ప్రకటన ఉంటుంది.

సూర్య స్పోర్ట్స్

ఇషాన్ కిషన్

## ఎస్.ఆర్.హెచ్. కెప్టెన్?



రాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్కు సన్రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటుపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో, ఆ జట్టు యాజమాన్యం భారత టి 20 ప్రపంచ కప్ హీరో ఇషాన్ కిషన్ను జట్టు సారథిగా ఎంపిక చేసినట్లు సమాచారం.'టైమ్స్ ఆఫ్ ఇండియా' (టా×) నివేదిక ప్రకారం, ఫ్రాంచైజీ యాజమాన్యం అంతర్గతంగా చర్చలు జరిపి, జట్టులో నాయకత్వ బాధ్యతలు స్వీకరించడానికి ఇషాన్ కిషన్ అత్యంత సరైన ఆటగాడని ఒక నిర్ణయానికి వచ్చింది.గత ఏడాది జరిగిన 'యాషెస్' సిరీస్ తర్వాత ఈ ఆస్ట్రేలియా పేసర్ మైదానానికి దూరంగా ఉన్నాడు; ఆ సిరీస్లో అతను కేవలం ఒక మ్యాచ్ మాత్రమే ఆడాడు. జాతీయ జట్టు తరపున టి 20 ప్రపంచ కప్కు కూడా అతను దూరమయ్యాడు. వెన్ను కింది భాగంలో (శ్రీబఎమ్ఖితీ) ఏర్పడిన ఒత్తిడి గాయం కారణంగా గత ఎనిమిది నెలలుగా అతను ఆటలకు దూరంగా ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఐపీఎల్ 2025 సీజన్ కోసం ఇషాన్ కిషన్ రూ. 11.25 కోట్లకు ా=ఎ జట్టులో చేరాడు. ఆ సీజన్లో అతను 14 మ్యాచ్లలో 152.58 స్ట్రైక్ రేట్తో 354 పరుగులు సాధించాడు; ఇందులో ఒక శతకం మరియు ఒక అర్ధశతకం ఉన్నాయి. మొత్తంగా, అతను మూడు వేర్వేరు ఫ్రాంచైజీల తరపున 119 ఐపీఎల్ మ్యాచ్లు ఆడాడు. ఈ టోర్నమెంట్ చరిత్రలో, అతను ఆడిన 119 మ్యాచ్లలోని 112 ఇన్నింగ్స్లో 137.64 స్ట్రైక్ రేట్తో 2,998 పరుగులు సాధించాడు; ఇందులో ఒక శతకం మరియు 17 అర్ధశతకాలు ఉన్నాయి. టి 20 ప్రపంచ కప్ 2026 టోర్నమెంట్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన ఉత్సాహంతో ఇషాన్ కిషన్ ఐపీఎల్ 2026 సీజన్లోకి అడుగుపెట్టనున్నాడు. ఈ ఏడాది ఆరంభంలో, న్యూజిలాండ్ సిరీస్ కోసం జట్టు ఎంపికలో శుభ్మన్ గిల్ స్థానాన్ని కోల్పోవడంతో, ఇషాన్ కిషన్ తిరిగి భారత టి 20 జట్టులో చోటు దక్కించుకున్నాడు.ఆ సిరీస్లో ఇషాన్ కిషన్ తన ఆటతీరుతో ఆకట్టుకున్నాడు; స్వదేశంలో న్యూజిలాండ్పై ఒక శతకం సాధించి, ప్రపంచ కప్ ఆడే తుది జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఆ టోర్నమెంట్లో భారతదేశం తరపున అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్లలో అతను రెండో స్థానంలో నిలిచాడు. తొమ్మిది ఇన్నింగ్స్లో 35.22 సగటుతో, 193 స్ట్రైక్ రేట్తో అతను మొత్తం 317 పరుగులు రాబట్టాడు. ఈ టోర్నమెంట్లో అతను మూడు అర్ధశతకాలు సాధించాడు; వీటిలో ఒకటి ఫైనల్ మ్యాచ్లో నమోదైంది.

చెన్నై సూపర్ కింగ్స్కు

## కొత్త కోచ్ నియామకం




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ ఎడిషన్ మార్చి 28 నుంచి ప్రారంభం కానుంది. టోర్నమెంట్ ప్రారంభానికి ముందే జట్లు కొత్త సీజన్ కోసం సన్నద్ధమవుతున్నాయి. ఐదుసార్లు ఛాంపియన్గా నిలిచిన సూపర్ కింగ్స్, తమ ఫ్రాంచైజీకి కొత్త ఫీల్డింగ్ కోచ్గా మాజీ ఇంగ్లాండ్ క్రికెటర్ జేమ్స్ ఫోస్టర్ను నియమించినట్లు ప్రకటించింది.గమనించదగ్గ విషయం ఏమిటంటే, జేమ్స్ ఫోస్టర్ ఇంగ్లాండ్ తరఫున 23 మ్యాచ్లలో ప్రాతినిధ్యం వహించారు. తన ఆటగాడిగా ఉన్న రోజుల్లో ఆ 23 మ్యాచ్లలో అతను 299 పరుగులు సాధించాడు. అంతేకాకుండా, ఫ్రాంచైజీ క్రికెట్లో అతనికి కోచింగ్లో విస్తారమైన అనుభవం ఉంది.జనవరిలో డెసర్ట్ వైపర్స్ జట్టుకు హెడ్ కోచ్గా అతను ఐఎల్టి20ని గెలుచుకున్నాడు. అలాగే, 'ది హండ్రెడ్' టోర్నమెంట్లో బర్మింగ్హామ్ ఫీనిక్స్ జట్టుకు అసిస్టెంట్ కోచ్గా కూడా నియమితులయ్యాడు. ఇంగ్లాండ్ మరియు న్యూజిలాండ్ జట్ల కోచింగ్ సిబ్బందిలో పనిచేసిన అనుభవం కూడా అతనికి ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ అతన్ని నియమించడానికి ముందు, ఫోస్టర్ కోల్కతా నైట్ రైడర్స్కు ఫీల్డింగ్ కోచ్గా పనిచేశాడు. ఇప్పుడు అతను సీఎస్కే ఫీల్డింగ్ను మెరుగుపరచడానికి వారితో కలిసి పనిచేయనున్నాడు. ఐదుసార్లు ఛాంపియన్గా నిలిచిన ఈ జట్టు చివరిసారిగా ఐపీఎల్ 2023లో గెలిచింది. రాబోయే సీజన్కు ముందు జట్టులో కొంతమంది యువ ఆటగాళ్లు చేరడంతో, ఈ సీజన్లో మంచి ప్రదర్శన చేయాలని వారు ఆశిస్తున్నారు. ఆర్ ఆర్ తో మ్యాచ్తో ఐపీఎల్ 2026 ప్రచారాన్ని ప్రారంభించనున్న జూఖ మార్చి 30న గౌహతిలో తొలి ఛాంపియన్షైన రాజస్థాన్ రాయల్స్తో జరిగే మ్యాచ్తో సి.ఎస్.కె. ఈ టోర్నమెంట్లో తమ ప్రచారాన్ని ప్రారంభిస్తుంది. ఇంకా, ఆర్ ఆర్ తో మ్యాచ్ తర్వాత, ఏప్రిల్ 3న పంజాబ్ కింగ్స్ (పి బి ఎస్ కె )తో తలపడుతుంది. ఆ తర్వాత ఏప్రిల్ 5న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో, ఏప్రిల్ 11న ఢిల్లీ క్యాపిటల్స్తో ఈ జట్టు తలపడుతుంది.ఐపీఎల్ 2026లో 20 మ్యాచ్ల షెడ్యూల్, అలాగే టోర్నమెంట్లోని మిగిలిన భాగం యొక్క టైమ్టేబుల్ ఇప్పటివరకు విడుదల చేయబడింది. ఐదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కారణంగా తేదీలను ప్రకటించలేదు. ఇప్పుడు తేదీలు వెల్లడైనందున, మిగిలిన షెడ్యూల్ ఒకటి లేదా రెండు రోజుల్లో వెల్లడి చేయబడుతుంది.

# తిలక్ వర్మకు సీఎం సత్కారం





ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్ విజయం సాధించిన అనంతరం హైదరాబాద్కు తిరిగి వచ్చిన భారత క్రికెటర్ తిలక్ వర్మను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సత్కరించారు.భారత్ విజయవంతమైన ప్రచారంలో కీలక పాత్ర పోషించినందుకు హైదరాబాద్ వాసి అయిన వర్మను ముఖ్యమంత్రి అభినందించి, సత్కరించారు. తెలంగాణ సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు వైకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేనా రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాస రాజు, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి, రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తిలక్ వర్మను అభినందించారు మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ కూడా తిలక్ వర్మను అభినందించి, భారత క్రికెట్కు ఆయన అంకితభావాన్ని ప్రశంసించారు. తిలక్ వర్మ సాధించిన విజయాలు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న యువ క్రీడాకారులకు క్రీడలలో కెరీర్ను కొనసాగించడానికి మరియు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడానికి స్ఫూర్తినిస్తాయని అజారుద్దీన్ అన్నారు. యువ ప్రతిభను ప్రోత్సహించడం, క్రికెట్ మరియు ఇతర క్రీడలలో రాణించేలా యువతను ప్రోత్సహించడం యొక్క ప్రాముఖ్యతను అజారుద్దీన్ నొక్కి చెప్పారు.తిలక్ వర్మ టీ20 ప్రపంచకప్ ప్రదర్శన టీ20 అంతర్జాతీయ క్రికెట్లో ఒక కీలక మలుపుగా నిలిచిన 2025లో, ఎడమచేతి వాటం బ్యాట్స్మెన్ అయిన వర్మ, ఆసియా కప్ మరియు దక్షిణాఫ్రికాపై కీలక ప్రదర్శనలతో సహా 20 మ్యాచ్లలో 567 పరుగులు చేసి, ఒక కీలక బ్యాటర్గా స్థిరపడ్డాడు. ఆ సమయంలో, అతను 3 మరియు 4వ స్థానాలలో 13 సార్లు, అదనంగా 5, 6, మరియు 7వ స్థానాలలో ఒక్కోసారి బ్యాటింగ్ చేశాడు.ఓపెనర్గా లేదా టాప్-ఆర్డర్ బ్యాటర్గా అతని అత్యుత్తమ ప్రదర్శనలు వచ్చాయి. టీ 20 ప్రపంచకప్ తర్వాత, వర్మ భారతదేశానికి ఒక కీలకమైన ఫినిషర్గా ఎదిగాడు. అతను కేవలం టాప్-ఆర్డర్లో బ్యాటింగ్ చేయడమే కాకుండా, ఫినిషర్ పాత్రను కూడా సునాయాసంగా పోషించగలనని నిరూపించుకున్నాడు. వర్మ భారతదేశపు అత్యంత నమ్మకమైన మరియు బహుముఖ ప్రజ్ఞ గల మిడిల్-ఆర్డర్ బ్యాటర్లలో ఒకరిగా ప్రశంసలు అందుకున్నాడు. అతను తరచుగా ఇన్నింగ్స్ను నిలబెడుతూ, భవిష్యత్ స్టార్గా గొప్ప భవిష్యత్తును సూచించాడు. ఇది కొంతకాలం పాటు నిజమే, ముఖ్యంగా అతను టీ20లలో 3వ స్థానంలో బ్యాటింగ్ చేసి 649 పరుగులు, 4వ స్థానంలో బ్యాటింగ్ చేసి 490 పరుగులు సాధించాడు. అయితే, 2026 టీ20 ప్రపంచ కప్ ఆ అభిప్రాయాన్ని పూర్తిగా తలక్రిందులు చేసింది.2026 ు20 ప్రపంచ కప్లో, భారత్ ఆడిన తొమ్మిది మ్యాచ్లలో ఐదింటిలో తిలక్ మూడవ స్థానంలో బ్యాటింగ్ చేశాడు; ఆ మ్యాచ్లలో అతని స్కోర్లు వరుసగా 25, 25, 25, 31 మరియు 1గా నమోదయ్యాయి.ఆరంభంలో లభించిన మంచి అవకాశాలను భారీ ఇన్నింగ్స్గామలచడంలో యువ ప్రతిభను ప్రోత్సహించడం, క్రికెట్ మరియు ఇతర క్రీడలలో రాణించేలా యువతను ప్రోత్సహించడంఅతను పడిన ఇబ్బందులను, ఈ గణాంకాలు స్పష్టంగా ప్రతిబింబించాయి. మిగిలిన మ్యాచ్లలో అతన్ని ఐదవ స్థానంలో లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్ చేయమని కోరినప్పుడు, ఫలితాలు అద్భుతంగా వచ్చాయి.

# వోల్వర్హాంప్టన్ వాండరర్స్ అద్భుత కంబ్యాక్ డ్రా



ప్రీమియర్ లీగ్లో అట్టడుగున ఉన్న వోల్వ్స్, సోమవారం బ్రెంట్ఫోర్డ్పై రెండు గోల్స్ వెనుకబడినప్పటికీ అద్భుతంగా పుంజుకుంది. టోలు అరోకోడారే చివరి నిమిషంలో చేసిన గోల్ పుణ్యమా అని మ్యాచ్ 2-2తో డ్రాగా ముగిసింది. జిటెక్ కమ్యూనిటీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్లో రాబ్ ఎడ్వర్డ్స్ జట్టు, మైఖేల్ కయోడే మరియు ఇగోర్ థియాగో చేసిన గోల్స్తో వెనుకబడింది. కానీ, అర్ధ సమయానికి కొద్దిసేపటి ముందు ఆడమ్ ఆర్మ్స్ట్రాంగ్ ఒక గోల్ చేసి తేడాను తగ్గించగా, మ్యాచ్ చివరి దశలో నైజీరియా స్ట్రైకర్ అరోకోడారే వోల్వ్స్ తరపున స్కోరును సమం చేశాడు. ఆస్టన్ విల్లా మరియు లివర్పూల్లపై సంచలన విజయాల తర్వాత ఈ స్ఫూర్తిదాయకమైన ప్రదర్శనతో వోల్వ్స్ తమ చివరి మూడు లీగ్ మ్యాచ్లలో అజేయంగా నిలిచింది.ఇంకా ఏడు మ్యాచ్లు మాత్రమే మిగిలి ఉండగా, సేఫ్టీ జోన్ నుండి 12 పాయింట్ల దూరంలో ఉన్న ఈ జట్టు, లీగ్ నుండి నిష్క్రమించడం దాదాపు ఖాయంగా ఉంది.మీరు మమ్మల్ని చెల్సియాతో సమానంగా మాట్లాడుతున్నప్పుడు, కేవలం ఒక్క జట్టు మాత్రమే ఉందని పరిగణనలోకి తీసుకుంటే అది స్పష్టంగా చాలా మంచి విషయం." "ఇంకా ఎనిమిది ఆటలు మిగిలి ఉన్నాయి," అని ఆండ్రూస్ అన్నారు.ఒకవేళ వోల్వ్స్ ఛాంపియన్షిప్లోకి పడిపోయినా, నిశ్శబ్దంగా నిష్క్రమించకుండా ఉండటం వారికి ధైర్యాన్నిస్తుంది."2-0తో వెనుకబడినప్పుడు చెప్పడం కష్టం, కానీ మేము ఈ మ్యాచ్ గెలవగలమని నేను భావించాను," అని ఎడ్వర్డ్స్ అన్నారు.ఇది జట్టులో ఉన్న పోరాట పటిమను, ధైర్యాన్ని, నాణ్యతను, స్ఫూర్తిని చూపిస్తుంది."మేము ఈ స్థితిలో ఉన్నప్పటికీ, నిజానికి మేమంతా ఐక్యంగా ఉన్నట్లు అనిపిస్తుంది."ఏడవ స్థానంలో ఉన్న బ్రెంట్ఫోర్డ్కు ఇది ఒక బాధాకరమైన ఫలితం. యూరప్కు అర్హత సాధించాలనే తమ అనూహ్యమైన ప్రయత్నానికి బలం చేకూర్చుకునే అవకాశాన్ని వారు చేజార్చుకున్నారు. ఛాంపియన్స్ లీగ్ స్థానం కోసం పోటీలోకి దూసుకెళ్లే విజయాన్ని సాధించడంలో విఫలమైన తర్వాత, కీత్ ఆండ్రూస్ జట్టు ఆరవ స్థానంలో ఉన్న చెల్సియా కంటే మూడు పాయింట్లు, ఐదవ స్థానంలో ఉన్న లివర్పూల్ కంటే నాలుగు పాయింట్లు వెనుకబడి ఉంది.ఈ సీజన్ ప్రారంభంలో రెలిగేషన్ అభ్యర్థులుగా అంచనా వేయబడిన బ్రెంట్ఫోర్డ్, గత వేసవిలో మేనేజర్ థామస్ ఫ్రాంక్ మరియు ఫార్వర్డ్లు బ్రయాన్ ఎంబ్యూమో, యోవాన్ విస్సాలను కోల్పోయిన తర్వాత ఒక అద్భుతమైన ప్రచారాన్ని ఆస్వాదించింది. కానీ ఏడు రోజుల వ్యవధిలో వారు బలహీనమైన వెస్ట్ హామ్ చేతిలో ఫీూా కప్ నుండి నిష్క్రమించారు మరియు వోల్వ్స్తో జరిగిన మ్యాచ్లో బలమైన స్థానాన్ని చేజార్చుకుని తమ చిరస్మరణీయమైన సీజన్ను ప్రమాదంలో పడేసుకున్నారు."మీరు మమ్మల్ని చెల్సియాతో సమానంగా మాట్లాడుతున్నప్పుడు, కేవలం ఒక్క జట్టు మాత్రమే ఉందని పరిగణనలోకి తీసుకుంటే అది స్పష్టంగా చాలా మంచి విషయం." "ఇంకా ఎనిమిది ఆటలు మిగిలి ఉన్నాయి," అని ఆండ్రూస్ అన్నారు."కానీ వాస్తవం ఏమిటంటే, ఈ రాత్రి మేము ఇంకా మెరుగ్గా రాణించి ఉండాల్సింది."22వ నిమిషంలో కీన్ లూయిస్-పాటర్ అందించిన చక్కటి క్రాస్ను అందుకున్న కయోడే, వోల్వ్స్ ఆటగాళ్ల అజాగ్రత్త మార్కింగ్ను సులభంగా తప్పించుకుని, మనం ఆ విషయంలో నిజాయితీగా ఉండి, మనల్ని మనం సమీక్షించుకోవాలి."22వ నిమిషంలో కీన్ లూయిస్-పాటర్ అందించిన చక్కటి క్రాస్ను అందుకున్న కయోడే, వోల్వ్స్ ఆటగాళ్ల అజాగ్రత్త మార్కింగ్ను సులభంగా తప్పించుకుని, ఆరు గజాల దూరం నుండి జోస్ సాను దాటుకుంటూ హెడర్తో బంతిని గోల్లోకి పంపడంతో బ్రెంట్ఫోర్డ్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.ఇటాలియన్ డిఫెండర్కు బ్రెంట్ఫోర్డ్ తరపున ఇది తొలి గోల్ కాగా, 2024లో ఫియోరెంటినా తరపున లాజియోపై గోల్ చేసిన తర్వాత ఏ క్లబ్ తరపున అయినా ఇదే అతనికి తొలి గోల్.37వ నిమిషంలో థియాగో బ్రెంట్ఫోర్డ్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు.బ్రెంట్ఫోర్డ్ కీపర్ కావోయిమ్హిన్ కెల్లెహర్ చేసిన లాంగ్ క్లియరెన్స్ను డాంగో ఒట్టారా అద్భుతంగా నియంత్రించి, నిస్వార్థంగా బంతిని అందించగా, అది సమీప దూరం నుండి గోల్గా మలచింది.సోమవారం బ్రెజిల్ జట్టుకు తొలిసారిగా ఎంపికైన థియాగో, ఈ సీజన్లో అన్ని పోటీలలో కలిపి 32 మ్యాచ్లలో 22 గోల్స్ సాధించాడు.క్లబ్ తరపున ఆర్మ్స్ట్రాంగ్ తన తొలి గోల్తో వోల్వ్స్ ఆధిక్యాన్ని తగ్గించుకుంది. 44వ నిమిషంలో.జీన్-రిక్నర్ బెల్లెగార్డ్ అందించిన పాస్ను ఆర్మ్స్ట్రాంగ్ అందుకోగా, ఆ స్ట్రైకర్ ఏరియా అంచు నుండి బంతిని అద్భుతంగా టాప్ కార్నర్లోకి పంపాడు.బ్రెంట్ఫోర్డ్ నియంత్రణ కోల్పోతుండటంతో, వోల్వ్స్ సమం చేసే గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించింది, అది 77వ నిమిషంలో లభించింది.యెర్సన్ మోస్క్వెరా, జోవా గోమ్స్కు పాస్ అందించగా, అతను ఫార్ పోస్ట్కు పంపిన క్రాస్ను అరోకోడారే బలంగా హెడర్ చేసి గోల్ సాధించాడు.





# లేటెస్ట్ అవుట్‌ఫిట్‌లో రాశి

మనం సినిమాలో కామియో పాత్ర పోషించి.. అలా వచ్చి ఇలా మెరిసిన రాశి ఖన్నా ఊహలు గుసగుసలాడే చిత్రంలో శ్రీ సాయి శిరీష ప్రభావతి అలియాస్ ప్రభ క్యారెక్టర్ లో మెరిసి అందరి దృష్టిని ఆకట్టుకుంది. సింపుల్ స్మైల్ తో మెస్మరైజ్ చేసిన ఈ సొట్ట బుగ్గల సుందరి మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఆ తర్వాత జోరు, జిల్, శివ, బెంగాల్ టైగర్, సుప్రీం, హైపర్, జై లవకుశ, రాజా ది గ్రేట్ అంటూ పలు చిత్రాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్న రాశి ఖన్నా 2017లో తొలిసారి విలన్ అనే మల యాళం చిత్రంలో నటించి మలయాళ సినీ పరిశ్రమకు పరిచయ మైంది. ఉస్తాద్‌తో అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్న రాశి ఖన్నా.. మళ్లీ తెలుగులో అవకాశాలు అందుకుంటూ ఆక్సిజన్, టచ్ చేసి చూడు, తొలిప్రేమ, శ్రీని వాస కళ్యాణం ఇలా పలు చిత్రాలు చేసిన రాశిఖన్నా చివ రిగా 2022లో వచ్చిన థాంక్యూ సినిమా తర్వాత మళ్లీ కనిపించలేదు. ఇక తమిళ్, హిందీ చిత్రాలలోనే నటిస్తూ బిజీగా మారిన.. ఈమె మళ్లీ 20 25లో సిద్దు జొన్నల గడ్డ హీరోగా వచ్చిన తెలుసు కదా అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా పెద్దగా ఫలితాన్ని ఇవ్వలేదు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో ప్రేక్షకులను మాయ చేయడానికి సిద్ధమ య్యింది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే పవన్ కళ్యాణ్ హరీష్ శంకర్ కాంబినేషన్లో వస్తున్న ఈ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో మరో హీరోయిన్ శ్రీ లీలతోపాటు నటిస్తోంది. పుత్తడి బొమ్మల ఈవెంట్ కే స్పె షల్ అట్రాక్షన్.. మార్చి 19వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న నేప థ్యంలో ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను ఘనంగా నిర్వహిం చారు. ఆ ఈవెంట్లో శ్రీ లీలతో పాటు రాశి ఖన్నా కూడా సందడి చేశారు. ముఖ్యంగా తన గ్లామర్ టచ్‌తో ఉస్తాద్ ఈవెంట్లో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది రాశిఖన్నా. హెవీ ఎంబ్రాయిడరీతో డిజైన్ చేసిన లెహంగాను ధరించి.. అందుకు తగ్గట్టుగా జువెలరీతో మరింతగా ఆకట్టుకుంది. ఇకపోతే నైట్ ఈవెంట్లో తన దుస్తులతో ఈవెంట్ కే స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచిందని చెప్పవచ్చు. లెహంగాను చేతులతో పట్టుకొని.. స్టేజ్ పైకి అడు గులు వేస్తూ పదహారణాల తెలుగమ్మాయిలా అందరి దృష్టిని ఆకర్షించింది రాశి ఖన్నా. ఇక ఆ ఫోటోలను ఇప్పుడు తాజాగా తన ఇంస్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతు న్నాయి. అమ్మడి అందానికి అభిమానులు సైతం ఫిదా అవుతు న్నారు. సింపుల్ స్మైల్‌తో తన గ్లామర్ టచ్‌తో ఈవెంట్ కే కొత్త అందాన్ని తీసుకొ చ్చింది ఈ లేడీ బ్యూటీ. మరొకవైపు ఈ సినిమా ప్రమోష న్స్‌లో జోరుగా పాల్గొంటుంది. రాశిఖన్నా.. ఈ సినిమా కథ వినకుండానే కేవలం పవన్ కళ్యాణ్ కోసం ఒకే చేశానని చెప్పిన ఈమె.. తెలుగు ఇండ స్ట్రీలో అలాంటి అవకాశం మరి ఎవరికి ఇస్తారు అని అడగగా.. వెంటనే మహేష్ బాబు అని చెప్పేసింది. ఇక త్వరలోనే ఆ కల కూడా నెరవేరాలని అభిమా నులు ఆకాంక్షిస్తున్నారు.

## పలు భాషల్లోకి 'వనజీవి రామయ్య' బయోపిక్

పద్మశ్రీ అవార్డు గ్రహీత, 'కోటి మొక్కల రామయ్య'గా ప్రసిద్ధి చెందిన వనజీవి దరిపల్లి రామయ్య జీవిత కథ వెండితెరపైకి వచ్చింది. సమా జానికి పర్యావరణ సందేశాన్ని అందించిన ఈ మహనీయుడి జీవితం ఆధా రంగా రూపొందిన 'వనజీవి రామయ్య' బయోపిక్ తెలంగాణ ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా అందించే గద్దర్ అవార్డుల్లో బెస్ట్ షార్ట్ ఫిలిమ్స్ విభాగంలో ఎంపికైంది. నంది అవార్డు గ్రహీత వేముగంటి దర్శకత్వంలో నిదిగొండ నరేష్ కుమార్ ప్రజాపతి, భూషం రవీంద్రనాథ్, లింగంపల్లి చంద్రశేఖర్ నిర్మించిన ఈ సినిమాకు బల్లేపల్లి మోహన్ సంగీతాన్ని అందించారు. తాజాగా చిత్రయూనిట్ హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ప్రత్యేక ప్రివ్యూ ప్రదర్శన నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, టీజేఎస్ చీఫ్ ప్రొఫెసర్ కోదండరాం, రాజకీయ విశ్లేషకులు వి.ప్రకాష్, తన్నేరు బాబురావు, నాగమహేష్, సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, తమ్మారెడ్డి భరద్వాజ తదితరులు హాజరై చిత్రాన్ని అభినం దించారు. ఈ చిత్రాన్ని భారతీయ భాషల్లో కూడా విడుదల చేయాలని నిర్ణయించినట్లు చిత్ర బృందం వెల్ల డించింది. దర్శకుడు వేముగంటి మాట్లాడుతూ, "కోటి మొక్కలు నాటి ప్రకృతికి సేవ చేసిన రామయ్యగారి జీవితం భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలవాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిం చాం. త్వరలోనే భారతీయ భాషల్లో కూడా ఈ బయోపిక్‌ను తీసుకురానున్నాం" అని తెలి పారు. సంగీత దర్శకుడు బల్లే పల్లి మోహన్ కూడా ఇదే భావనను వ్యక్తం చేస్తూ, ఈ చిత్రాన్ని ప్రకృతి ప్రేమికుడు రామయ్యకు నివాళిగా అంకితం చేస్తున్నామని చెప్పారు.




# బ్యాంకాక్‌లో బన్నీ

టాలీవుడ్ పుష్పరాజ్ అంటే ఎప్పుడూ షూటింగ్‌లతో బిజీగా ఉంటాడనుకుంటే పొరపాటే.. అప్పుడప్పుడు ఫ్యామిలీకి కూడా అదిరిపోయే టైమ్ ఇస్తుంటాడు. తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన భార్య స్నేహ రెడ్డి మరియు స్నేహితులతో కలిసి బ్యాంకాక్ వెకేషన్‌కు వెళ్లారు. అక్కడ దిగిన క్యూట్ ఫోటోలను స్నేహ రెడ్డి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అవి కాస్తా వైరల్ అయ్యాయి. వర్క్ టెన్షన్లన్నీ పక్కన పెట్టి బన్నీ ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో చిల్ అవుతూ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. బ్యాంకాక్ వీధుల్లో వెకేషన్ సందడి: సినిమా షూటింగ్‌ల నుంచి చిన్న గ్యాప్ దొరకగానే అల్లు అర్జున్ తన ఫ్యామిలీతో కలిసి ఫారిన్ ట్రిప్స్ ప్లాన్ చేస్తుంటారు. ఈసారి బ్యాంకాక్‌ను తన వెకేషన్ స్పాట్‌గా ఎంచుకున్నారు. స్నేహ రెడ్డి తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసిన ఫోటోలలో బన్నీ ఎంతో కూల్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఇక వాళ్ల ఫ్రెండ్స్ గ్యాంగ్‌తో కలిసి దిగిన గ్రూప్ ఫోటోలు చూస్తుంటే ఈ వెకేషన్ చాలా స్పెషల్‌గా సాగుతున్నట్లు అర్థమవుతోంది. అల్లు అర్జున్ ఫ్యాన్స్ కూడా ఈ ఫోటో లను చూసి బన్నీకి కాస్త రెస్ట్ అవసరం, ఎంజాయ్ చేయండి అన్న అంటూ కామెంట్లతో సోషల్ మీడియాను నింపేస్తున్నారు. అట్లీతో భారీ విజువల్ వండర్: ఇక సినిమాల విషయానికి వస్తే.. 'పుష్ప 2'తో ప్రపంచవ్యాప్తంగా రికార్డులు క్రియేట్ చేసిన బన్నీ, ప్రస్తుతం కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తన తదుపరి సినిమా చేస్తున్నారు. ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్ షూటింగ్ ఇప్పటికే 70% పూర్తి అయిందని సమాచారం. చాలా భారీ బడ్జెట్‌తో, హై విజువల్ వండర్‌గా ఈ సినిమాను అట్లీ ప్లాన్ చేశారట. ముఖ్యంగా ఈ సిని మాలో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొనే హీరోయిన్‌గా నటిస్తుండ టంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇక అల్లు అర్జున్ ఎనర్జీకి అట్లీ మాస్ టేకింగ్ తోడైతే బాక్సాఫీస్ వద్ద పూనకాలు రావడం ఖాయం. లోకేష్ కనగరాజ్ తో నెక్స్ట్ ప్రాజెక్ట్: అట్లీ సినిమా తర్వాత కూడా అల్లు అర్జున్ మరో క్రేజీ కోలీవుడ్ డైరెక్టర్‌తో జతకట్టబోతున్నారు. అదే లోకేష్ కనగరాజ్. తనకంటూ ఒక ప్రత్యేకమైన లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ సృష్టించుకున్న లోకేష్, బన్నీ కోసం ఒక పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను రెడీ చేసినట్లు తెలుస్తోంది. వరుసగా కోలీవుడ్ టాప్ డైరెక్టర్లతో పని చేస్తుండటం చూస్తుంటే, అల్లు అర్జున్ తన పాన్ ఇండియా మార్కెట్‌ను మరింత బలోపేతం చేసుకోవాలని పక్కా ప్లానింగ్‌తో ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఇక అట్లీ సినిమా పూర్తికాగానే ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉంది. మొత్తానికి అటు సినిమాలతో, ఇటు వెకేషన్లతో అల్లు అర్జున్ ఫుల్ బిజీగా గడుపుతు న్నారు. ఈ బ్యాంకాక్ ట్రిప్ పూర్తి కాగానే మళ్ళీ సినిమా షూటింగ్ పనుల్లో నిమగ్నం కానున్నారు. రాబోయే సినిమాలు బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తాయో అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# 'పిఠాపురంలో' 'మక్కుళు మక్కుళు కాలేజూ' పాట

ప్రముఖ దర్శకుడు మహేష్ చంద్ర దర్శకత్వంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, పథ్వీరాజ్, కేదార్ శంకర్, మణి చందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'పిఠాపురంలో'. దీనికి ఉప శీర్షిక 'అలా మొదలైంది'. మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్‌పై దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మించారు. జి.సి. క్రిష్ సంగీత దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలోని 'మక్కుళు మక్కుళు కాలేజూ యవ్వన మర్కట గ్యారేజూ' పాటను ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ఆవిష్కరించారు. ఈ పాటను శ్రీరామ్ తపస్వి రాశారు. ఈ సందర్భంగా వినాయక్ మాట్లాడుతూ "నేను కో డైరెక్టర్‌గా చంద్ర మహేష్ గారి దగ్గర 'చెప్పాలని ఉంది' చిత్రానికి పనిచేశాను. ఆ తర్వాత 'ఆది' సినిమాతో దర్శకుణ్ణి అయ్యాను. చంద్ర మహేష్‌గారు నాకు చాలా ఇష్టమైన వ్యక్తి. సుప్రసిద్ధ నిర్మాత డి. రామానాయుడుగారికి ఇష్టమైన దర్శకుల్లో చంద్ర మహేష్ ఒకరు. ఆయన యూత్ ఫుల్ ఎంటర్టైన్మెంట్ గా మూడువిభిన్న ప్రేమ కథలతో 'పిఠాపురంలో' చిత్రాన్ని రూపొందిం చారు. ఈ సినిమా పెద్ద హిట్టు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుం టున్నాను. అలాగే నిర్మాతలకు మంచి లాభాలు రావాలని ఆకాంక్షి స్తున్నాను" అని చెప్పారు. దర్శకుడు చంద్ర మహేష్ మాట్లాడుతూ "ఈ వారంలో ఈ సినిమా ట్రయిలర్ విడుదల చేస్తున్నాం. ఏప్రిల్‌లో చిత్రాన్ని విడుదల చేస్తాం. నా కెరీర్‌లోనే ఇదొక మంచి సినిమాగా నిలిచిపోతుంది" అని తెలిపారు.

# 'రాకాస' హక్కులను సొంతం చేసుకున్న శ్రీ లక్ష్మీ నరసింహా మూవీ మేకర్స్

ఏప్రిల్ 3న రిలీజ్ కానున్న ఫ్యాన్సీ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాకాస'పై భారీ అంచ నాలు నెలకొన్నాయి. ప్రారంభం నుంచి వైవిధ్యమైన కంటెంట్, ప్రమోషనల్ ప్లానిం గ్‌తో ఈ సినిమా అందరి దృష్టిని ఆకర్షి స్తోంది. తాజాగా ఈ సినిమా రిలీజ్‌కు ముందే జరిగిన థియేట్రికల్ బిజినెస్ డీల్ ఇందుకు ఉదాహరణ. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఈ సినిమా థియేట్రిల్ రైట్స్‌ను శ్రీ లక్ష్మి నరసింహా మూవీ మేకర్స్ భారీ మొత్తానికి సొంతం చేసుకున్నారు. దీంతో సిని మాపై ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్ ఏంటో తెలుస్తుంది. సినిమాకు థియేటర్స్‌లో మంచి ఆదరణ దక్కుతుందని ట్రేడ్ సర్కిల్స్ భావిస్తున్నాయి. రాకాస సినిమా విడుదలకు సిద్ధమవుతోన్న సమయంలో ఈ లేటెస్ట్ డీల్‌తో 'రాకాసా' చిత్రానికి డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ మరింత బలపడింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను శ్రీ లక్ష్మి నరసింహా మూవీ మేకర్స్ విడుదల చేస్తుండగా.. ఓవర్‌సీస్‌లో మేకర్స్ భారీ స్థాయిలో రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. అథర్వణ భద్రకాళి పిక్చర్స్ ఈ సినిమా అంతర్జాతీయ డిస్ట్రిబ్యూషన్ బాధ్యతలను నిర్వహిస్తోంది. ఈ సంస్థ అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, యూరప్, కెనడా, ఆస్ట్రేలియా వంటి కీలక ప్రాంతాల్లో కలిపి 350కు పైగా అంతర్జాతీయ స్క్రీన్లలో సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేసింది. ముఖ్యంగా నార్త్ అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ మార్కెట్లలో డిస్ట్రిబ్యూషన్ బాధ్యతలను ప్రత్యంగిరా సినిమాస్ చేపట్టింది. విదేశీ ప్రేక్షకుల కోసం ప్రీమియర్ షోలు 2026 ఏప్రిల్ 2న ప్రదర్శించనున్నారు. ఆ తర్వాతి రోజు సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ విషయాలతోనే కాకుండా ఈ సినిమాకు నాన్ థియేట్రికల్ రంగంలో కూడా మంచి డీలింగ్స్ కుదిరాయి. మూవీ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోగా..ఆడియో హక్కు లను సారెగమ దక్కించుకుంది. భారతదే శంలో ప్రముఖ మ్యూజిక్ లేబుల్స్‌లో ఒకటైన సారెగమ ఈ హక్కులను పొందడం విశేషం. ఈ రెండు డీలింగ్స్ చూస్తే ఇది సినిమాకు బిజినెస్ పరంగా మరింత బలం చేకూర్చడమే కాకుండా.. ప్రాజెక్ట్‌పై పెరుగుతోన్న ఎక్స్‌పెక్టే షన్స్‌ను తెలియజేస్తున్నాయి.



# యూత్ ఫ్రెషర్స్ మీట్

కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజర ముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ యూత్. ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 26న యూత్



మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. కమ్ విత్ యువర్ గ్యాంగ్, నోట్ - నో ఏజ్ లిమిట్ అనే స్లోగన్ తో ఈ సినిమా ప్రమోషనల్ క్యాంపెయిన్ చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా ఫ్రెషర్స్ మీట్ కార్యక్రమం పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో హైదరాబాద్ లో సందడిగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సాయి మార్తండ్ మాట్లాడుతూ - యూత్ సినిమాను మేమే తీసుకోవాలని అనుకున్నాం. కానీ ఇంతలో వినీత్, సందీప్ తీసుకున్నారు. కెన్ వర్సటైల్ పర్సన్. యాక్టింగ్, రైటింగ్, లిరిక్స్, సింగింగ్..ఇలా అన్నీ తానే టాప్ క్లాస్ లో చేస్తుంటాడు. నాకు మన మౌళిలా అనిపించాడు. ఈ సినిమా ట్రైలర్ చాలా బాగుంది, పాటలు బాగున్నాయి. సింజిత్ సాంగ్ పాడాడు. ఈ మూవీలోని మీనాక్షిని మా లిటిల్ హార్ట్స్‌లో హీరోయిన్‌గా తీసుకోవాలని అనుకున్నాం. యూత్ మూవీ చాలా బాగుంటుంది మీరంతా థియేటర్స్‌లో చూడాలని కోరుతున్నా. అన్నారు.



# 'పోలీస్ కంప్లైంట్' టీజర్



**సినీ ప్రముఖుల సమక్షంలో కన్నడ వెర్షన్ టీజర్ విడుదల**
**వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర ప్రధాన పాత్రలు**
**45 రోజుల్లో 52 మంది సీనియర్ ఆర్టిస్టులతో షూటింగ్**

సౌతిండియా ప్రేక్షకుల ముందుకు యాక్షన్, కామెడీ, హారర్ థ్రిల్లర్ కలగలిపిన సినిమాను తీసుకురాబోతున్నారు దర్శకుడు సంజీవ్ మేగోటి. వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, రాగిణి ద్వివేది, కృష్ణ సాయి ప్రధాన పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'పోలీస్ కంప్లైంట్' కన్నడ వెర్షన్ టీజర్‌ను బెంగళూరులో సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమం చిత్రబృందం, అతిథుల సందడితో హర్షాతిరే కంగా జరిగింది. ఈ వేడుకకు 'దేవి' చిత్రం ద్వారా గుర్తింపు పొందిన నటి ప్రేమ, 'దండుపాళ్యం' ఫేమ్ పూజా గాంధీ, కన్నడ ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. ఆర్.కె. విశ్వనాథ్ ముఖ్య అతిథులుగా హాజరై టీజర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాట్లాడిన ఎన్.ఆర్.కె. విశ్వ నాథ్, దర్శకుడు సంజీవ్ మేగోటి పదేళ్ల తర్వాత మళ్లీ ఒక మంచి కథతో కన్నడ ఇండస్ట్రీలోకి రావడం ఆనం దంగా ఉందని అభినందించారు. ఈ సినిమా ఘన విజయాన్ని అందుకో వాలని ఆకాంక్షించారు. నటి ప్రేమ చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలు పుతూ, సినిమా బ్లాక్ బస్టర్ సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నటి రాగిణి ద్వివేది మాట్లాడుతూ, 'పోలీస్ కంప్లైంట్' కథ ఎంతో ఆసక్తికరంగా ఉందని, ఇది ప్రేక్షకులను ఆకట్టుకునే సస్పెన్స్ థ్రిల్లర్ అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# 'అల్బుకర్క్యూ రికార్డ్స్'తో యూనివర్సల్ మ్యూజిక్ ఇండియా

సంగీత ఆధారిత వినోద రంగంలో ప్రపంచ అగ్రగామి సంస్థ అయిన యూనివర్సల్ మ్యూజిక్ గ్రూప్‌కు చెందిన విభాగం యూనివర్సల్ మ్యూజిక్ ఇండియా, ప్రముఖ గాయకుడు-సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఇటీవల ప్రారంభిం చిన స్వతంత్ర రికార్డ్ లేబుల్ అల్బుకర్క్యూ రికార్డ్స్‌తో ప్రత్యేక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వా మ్యం ద్వారా యూనివర్సల్ మ్యూజిక్ ఇండియా మరియు అల్బుకర్కీ రికార్డ్స్, అనిరుధ్ రవిచందర్ రూపొందించిన భవిష్యత్ పాప్ మరియు హిప్-హాప్ సంగీతాన్ని, అలాగే ఈ లేబుల్‌కు భవిష్యత్తులో చేరు తుంది ఇతర సంగీత కళాకారులు విడుదల చేయను న్నారు. ఈ లేబుల్ కింద విడుదలయ్యే తొలి సంగీత ప్రాజెక్ట్‌లో అనిరుధ్ పాల్గొనగా, అది ఏప్రిల్ ప్రారం భంలో విడుదల చేయాలని ప్రణాళిక రూపొందించబ డింది. ఈ గ్లోబల్ భాగస్వామ్యం ద్వారా యూనివర్సల్ మ్యూజిక్ ఇండియా మరియు అల్బుకర్కీ రికార్డ్స్ కలిసి పని చేస్తూ అని రుధ్ రవిచందర్ కళాత్మక ప్రతిభ యొక్క ప్రభావాన్ని మరింత విస్తరించ డానికి కృషి చేయనున్నాయి. కాలక్రమేణా ఈ లేబుల్ ప్రాంతంలోని ఎదు గుతున్న పాప్ మరియు హిప్-హాప్ కళాకారులకు ఒక ముఖ్యమైన వేది కగా మారి, వారి సంగీత ప్రయాణానికి నిలయంగా నిలవనుంది. గత 15 సంవత్సరాల్లో అనిరుధ్ రవిచందర్ సాధించిన విజయాల పరంపర అసాధారణమైనది, అసూయ కలిగించేంత గొప్పదిగా నిలిచింది. 20 12లో స్వరకర్తగా అరంగేట్రం చేసిన ఆయన, ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయిన తన హిట్ పాట వై దిస్ కొలవెరి డి ద్వారా విపరీతమైన



గుర్తింపును సంపాదించారు. ఆ తర్వాత విడుదలైన తన 770కి పైగా పాటల ద్వారా మొత్తం 13 బిలియన్‌కు పైగా ఆడియో స్ట్రీమ్స్ ను ఆయన సాధించారు. దీంతో మొత్తం స్ట్రీమ్స్ పరంగా స్పాటిఫైలో అత్యధిక స్ట్రీమ్స్ పొందిన దక్షిణ భారతీయ కళాకారుడిగా నంబర్-1 స్థానాన్ని ఆయన దక్కించుకున్నారు. అదనంగా, తమిళ ఒరిజినల్ సౌండ్‌ట్రాక్ (ఒ.ఎస్.టి.) రంగంలో ఎక్కువగా కోరుకునే సంగీత దర్శకుల్లో ఆయన ఒకరు. ప్రపంచ వ్యాప్తంగా చార్ట్‌లను అధిరోహించిన అనేక పాటలు ఆయన ఖాతాలో ఉన్నాయి. వాటిలో హుకుమ్, వాతీ కమింగ్, అరబిక్ కుతు, మోనికా, ఎ23 థీమ్, ఆజా రాజా, అయా షేర్ మరియు తదితర గ్లోబల్ హిట్లు ఉన్నాయి.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.